St 1 Year Happy Work Anniversary.

షణ్ముఖ SHANMUKHAVELUGU

# వెలుగు

ప్రతి వార్త వెలుగు వైపు          తెలుగు దినపత్రిక

RNI : APTEL / 2023 / 89152

Good for Health   Best for Readers   THE POWER OF PEN

సంపుటి : 3 సంచిక : 37 ఎడిటర్ & పబ్లిషర్ : ఓబులశెట్టి రాధాకృష్ణ దాస్ శనివారం 07 ఫిబ్రవరి 2026 పేజీలు 8 : వెల 3/-ఒంగోలు

VOLUME : 03 ISSUE : 37 EDITOR & PUBLISHER : OBULASETTY RADHAKRISHNA DASS PUBLISHED : ONGOLE Saturday 07 February 2026 PAGES : 8 PRICE : 3/-


## టీం 11... కల్తీకి, హత్యలకు బ్రాండ్ అంబాసిడర్లు

బూత్ మేనేజ్‌మెంట్ వర్క్‌షాప్‌లో పాల్గొన్న నారా లోకేశ్

బూత్ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయాలని కార్యకర్తలకు పిలుపు

విశాఖ ఉక్కును లాభాల్లోకి తెచ్చింది కూటమి ప్రభుత్వమేనని స్పష్టీకరణ

దేశ పెట్టుబడుల్లో 25 శాతం ఏపీకి వస్తున్నాయని వెల్లడి




(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఫిబ్రవరి 06)

'టీం 11' బృందం కల్తీ మద్యం, కల్తీ నెయ్యి, బాబాయి హత్యకు బ్రాండ్ అంబాసిడర్లుగా మారిందని రాష్ట్ర ఐటీ, విద్యాశాఖల మంత్రి, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ తీవ్రస్థాయిలో విమర్శించారు. దేవుడిని అడ్డం పెట్టుకుని రూ.250 కోట్లు దోచుకుని, ఇప్పుడు కల్తీ నెయ్యి కేసులో క్లీన్‌చిట్ వచ్చిందంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఈ దుష్ప్రచారాన్ని సమర్థంగా తిప్పికొట్టాలని ఆయన పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన బూత్ మేనేజ్‌మెంట్ వర్క్‌షాప్‌లో లోకేశ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "పార్టీ సొంతిల్లు, ప్రభుత్వం కిరాయి ఇల్లు అనే విషయాన్ని జీవితాంతం గుర్తుంచుకోవాలి. నాయకులు ఎంత ఎదిగినా, ఎన్ని ఇబ్బందులు వచ్చినా చివరకు మన దేవాలయం లాంటి టీడీపీ ఆఫీసుకే వస్తారు. పార్టీని బలోపేతం చేసేందుకు మనం అహర్నిశలు కష్టపడాలి" అని చంద్రబాబు చెప్పిన మాటలను గుర్తుచేశారు.

**బూత్ స్థాయి నుంచే పార్టీ పునర్నిర్మాణం :** "గ్రామస్థాయి నుంచి కాదు, బూత్ స్థాయి నుంచి పార్టీని పునర్నిర్మాణం చేయాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమం చేపట్టాం. బూత్ స్థాయిలో బలంగా ఉంటేనే టీడీపీ బలంగా ఉంటుంది" అని లోకేశ్ స్పష్టం చేశారు. 2019 ఎన్నికల తర్వాత -మిగతా 2లో

## కేంద్రమంత్రితో కలిసి 'క్వాంటం వ్యాలీ'కి నేడు సీఎం చంద్రబాబు శంకుస్థాపన

- అమరావతిలో 'క్వాంటం వ్యాలీ' ఏర్పాటుకు రంగం సిద్ధం
- నేడు సీఎం చంద్రబాబు, కేంద్రమంత్రి జితేంద్ర సింగ్ శంకుస్థాపన
- భారత్‌లో తొలి 133 క్యూబిట్ క్వాంటం కంప్యూటర్ ఏర్పాటు లక్ష్యం
- పరిశోధన, ఉపాధి రంగాల్లో విప్లవాత్మక మార్పులు రానున్నాయని అంచనా
- సామాన్యుడి జీవితంలో మార్పులు తీసుకురానున్న క్వాంటం టెక్నాలజీ



(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఫిబ్రవరి 06)

ఆంధ్రప్రదేశ్ చరిత్రలో ఒక సరికొత్త సాంకేతిక అధ్యాయానికి నాంది పలుకుతూ, అమరావతి రేపు ఒక చారిత్రక ఘట్టానికి వేదిక కానుంది. ప్రపంచ క్వాంటం టెక్నాలజీ రంగంలో రాష్ట్రాన్ని, దేశాన్ని అగ్రగామిగా నిలిపే లక్ష్యంతో ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'అమరావతి క్వాంటం వ్యాలీ' భవన నిర్మాణానికి శనివారం పునాదిరాయి పడనుంది. ఈ కీలక కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర శాస్త్ర, సాంకేతిక శాఖ మంత్రి జితేంద్ర సింగ్ హాజరుకానున్నారు. తుళ్లూరు మండలం ఉద్దండరాయునిపాలెం గ్రామంలో ప్రభుత్వం కేటాయించిన 50 ఎకరాల విస్తీర్ణంలో ఈ ప్రాజెక్టు రూపుదిద్దుకోనుంది. శనివారం మధ్యాహ్నం 2:45 గంటలకు ముఖ్యమంత్రి తన క్యాంపు కార్యాలయం నుంచి బయలుదేరి 3:00 గంటలకు శంకుస్థాపన ప్రదేశానికి చేరుకుంటారు. సాయంత్రం 6:00 గంటల వరకు జరిగే ఈ కార్యక్రమంలో పాల్గొని, అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తారు. ఈ ప్రాజెక్టుతో భారతదేశ క్వాంటం విప్లవానికి ఆంధ్రప్రదేశ్ నాయకత్వం వహించేందుకు మార్గం సుగమం కానుంది.

**రాష్ట్ర భవిష్యత్‌కు మైలురాయి :** అమరావతిలో ఏర్పాటు కానున్న క్వాంటం వ్యాలీ, రాష్ట్రానికే కాక దేశానికే ఒక మైలురాయిగా నిలవనుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. భారతదేశపు మొట్టమొదటి 133 క్యూబిట్ క్వాంటం కంప్యూటర్‌ను అమరావతికి తీసుకురావడంలో -మిగతా 2లో

## రూ.1.27 కోట్ల అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన

(షణ్ముఖ వెలుగు, విశాఖపట్నం,ఫిబ్రవరి 06)

జీవీఎంసీ 3వ వార్డు పరిధిలో రూ.1.27 కోట్ల వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు శుక్రవారం శంకుస్థాపన చేశారు. అనంతరం రూ.42 లక్షలతో ఆధునికీకరించిన కృష్ణానగర్ కమ్యూనిటీ హాల్‌ను ప్రారంభించారు. నేరెళ్లవలస కాలనీ, ఎగువపేట, గొల్లలపాలెం, అప్పికొండ వారి వీధి, కృష్ణా కాలనీ, నల్లి వీధి తదితర ప్రాంతాల్లో రోడ్లు, డ్రైనేజీలు తదితర పనులను చేపట్టనున్నారు. నియోజకవర్గంలోని ప్రతి జీవీఎంసీ వార్డులో రూ.15 కోట్ల అంచనాతో నిర్మాణ పనులు జరుగుతున్నాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

**తగరపువలస బస్ కాంప్లెక్స్ నిర్మాణానికి కూటమి ప్రభుత్వం చర్యలు**

తగరపువలస బస్ కాంప్లెక్స్ నిర్మాణానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు పేర్కొన్నారు. బస్ కాంప్లెక్స్ కోసం కేటాయించిన 4 ఎకరాల భూమిని శుక్రవారం ఆర్టీసీ ఆర్.ఎం.అప్పలనాయుడితో కలిసి ఆయన పరిశీలించారు. అనంతరంతో ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడుతూ.. కాంప్లెక్స్‌తో పాటు వాణిజ్య అవసరాల దృష్ట్యా మాల్‌ను కూడా అందుబాటులోకి తీసుకొస్తామని పేర్కొన్నారు. రవాణా వ్యవస్థలో వచ్చిన మార్పుల నేపథ్యంలో ఆర్టీసీ.. ఎలక్ట్రికల్ బస్సులకు ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందని అన్నారు. భోగాపురం ఎయిర్‌పోర్టులో మరో 5 నెలల్లో పూర్తిస్థాయి కార్యకలాపాలు ప్రారంభకానున్న నేపథ్యంలో బస్ కాంప్లెక్స్‌ల డిమాండ్ విపరీతంగా పెరిగిందన్నారు. తాగునీటి విషయంలో జీవీఎంసీ నాణ్యత -మిగతా 2లో



## జగన్ గుంటూరు పర్యటన... పలువురు నేతలపై కేసులు నమోదు

గుంటూరులో అంబటి రాంబాబు కుటుంబాన్ని పరామర్శించిన జగన్

జగన్ పర్యటన సందర్భంగా ర్యాలీలు నిర్వహించిన పలువురు వైసీపీ నేతలు

ట్రాఫిక్ కు అంతరాయం కలిగించారంటూ కేసులు నమోదు



(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఫిబ్రవరి 06)

అంబటి రాంబాబు కుటుంబాన్ని పరామర్శించేందుకు వైసీపీ అధినేత చేపట్టిన గుంటూరు పర్యటన సందర్భంగా వైసీపీ నేతలు హల్ చల్ చేశారు. పోలీసు యాక్ట్ 30ను పట్టించుకోకుండా అనుమతి లేకుండా ర్యాలీలు నిర్వహించారు. -మిగతా 2లో

## ఇరాన్‌లో భారతీయులు 'చిక్కుకున్నారా?' స్పందించిన జైశంకర్

ఇరాన్ గగనతలం తెరిచే ఉందని, ఇరుదేశాల మధ్య విమానాలు నడుస్తున్నాయని వెల్లడి

అందుకే ఇరాన్‌లోని భారతీయులను చిక్కుకుపోయిన వారిగా పరిగణించడం లేదన్న జైశంకర్

భారత విద్యార్థులకు ఎప్పటికప్పుడు అడ్వైజరీ జారీ చేస్తున్నట్లు వెల్లడి



(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,ఫిబ్రవరి 06)

ఇరాన్‌లోని భారతీయుల విషయమై విదేశాంగ శాఖ మంత్రి జైశంకర్ పార్లమెంట్ వేదికగా స్పందించారు. ఇరాన్‌లో పరిస్థితులను ఎప్పటికప్పుడు నిశితంగా గమనిస్తున్నామని తెలి పారు. అక్కడి భారత విద్యార్థులకు నిత్యం అడ్వైజరీ జారీ చేస్తున్నట్లు చెప్పారు. టెహ్రాన్‌లోని భారత రాయబార కార్యాలయం వారితో నిత్యం టచ్‌లోనే ఉంటోందని వెల్లడించారు. అవసరమైన సమయాల్లో సలహాలు ఇవ్వడంతో పాటు తగిన సాయం అందిస్తోం దని అన్నారు. ఇరాన్ గగనతలం తెరిచే ఉందని, ఇరుదేశాల మధ్య విమాన సర్వీసులు నడుస్తున్నాయని, -మిగతా 2లో

## మనకెందుకులే అనుకోవద్దు... ప్రతి భక్తుడిపై ధార్మిక బాధ్యత ఉంటుంది

హిందూ ధర్మంపై దాడులు జరిగినప్పుడు మౌనం వీడాలని పవన్ పిలుపు

కేవలం భక్తులుగా కాకుండా ధర్మ సంరక్షకులుగా ఉండాలన్న డిప్యూటీ సీఎం

కులం, ప్రాంతం వేరైనా మన ధర్మం ఒక్కటేనని వ్యాఖ్య

మన విశ్వాసాలను కాపాడుకోవడమంటే ఇతర మతాలకు వ్యతిరేకం కాదని స్పష్టీకరణ



(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఫిబ్రవరి 06)

ప్రతి భక్తుడిపై ధార్మిక బాధ్యత ఉంటుందని, హిందూ దేవుళ్లను, ధర్మాన్ని కించపరిచినప్పుడు మౌనంగా ఉండకుండా తమ గళాన్ని వినిపించాలని ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పిలుపునిచ్చారు. సగటు హిందువు మనస్తత్వంలో మార్పు రావాలని, భయంతో లేదా సౌలభ్యం కోసం మౌనంగా ఉండే ధోరణిని వీడాలని ఆయన సూచించారు. దేవుడిపై భయం, విశ్వాసంపై గౌరవం ఉన్నప్పటికీ, మన ధర్మాన్ని ఎవరైనా దురుద్దేశంతో అపహాస్యం చేసినప్పుడు కేవలం వ్యక్తిగతంగా బాధపడి, కర్మకు వదిలేసి ముందుకు సాగే అలవాటు మారాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. పవన్ కల్యాణ్ తన అభిప్రాయాలను వివరిస్తూ, "మనం కులం, మతం, ప్రాంతం, భాషల పరంగా విభజనకు గురై ఉండవచ్చు. కానీ మనందరి ధర్మం ఒక్కటే, దేవుళ్లు కూడా అంతే. మన విశ్వాసాలను, ధర్మాన్ని ఉద్దేశపూర్వకంగా అవమానించినప్పుడు మన బాధను తెలియజేయడం మనందరి కర్తవ్యం. ఇలాంటి కీలక సమయాల్లో పాటించే మౌనం సమిష్టి చైతన్యాన్ని బలహీనపరుస్తుంది" అని పేర్కొన్నారు. ప్రతీ ఒక్కరూ కేవలం భక్తులుగా మిగిలిపోకుండా, తమ విశ్వాసాలకు స్ఫూహతో కూడిన సంరక్షకులుగా కూడా వ్యవహరించాలని ఆయన కోరారు. హిందూ ధర్మాన్ని రక్షించుకోవడమంటే ఇతర మతాలకు వ్యతిరేకంగా ఉండటం కాదని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. తమ సొంత విశ్వాసాలను, సంప్రదాయాలను కాపాడుకోవడం మాత్రమేనని ఆయన వివరించారు. హిందువులు తమ ధార్మిక బాధ్యతను గుర్తించి, సోమరితనం వీడి, తమ విశ్వాసాల పరిరక్షణకు సమిష్టిగా ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ మార్పు ద్వారానే హిందూ ధర్మం యొక్క గౌరవాన్ని కాపాడుకోగలమని ఆయన ట్వీట్ చేశారు.

## సిక్కుల పట్ల కాంగ్రెస్ అగ్రనేతకు ఎంత ద్వేషం ఉందో ఆ మాటల్లో కనిపించింది

కాంగ్రెస్ పార్టీని ఎంతోమంది వీడారు కానీ బిట్టును మాత్రం అవమానించారన్న మోదీ



(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,ఫిబ్రవరి 06)

గరీబీ హఠావో కాంగ్రెస్ పార్టీకి ఒక నినాదం మాత్రమేనని వ్యాఖ్య సిక్కుల పట్ల కాంగ్రెస్ అగ్రనేతకు (రాహుల్ గాంధీకి) ఎంత ద్వేషం ఉందో ఆయన మాటల్లోనే -మిగతా 2లో

# ఉలవపాడు డిగ్రీ కళాశాలలో ఓపెన్ డే కార్యక్రమం



(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, ఫిబ్రవరి 6)

మండల కేంద్రమైన ఉలవపాడు జివిఎస్ఎం గవర్నమెంట్ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఓపెన్ డే కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా గవర్నమెంట్ జూనియర్ కళాశాల విద్యార్థులకు గవర్నమెంట్ డిగ్రీ కాలేజీలోని సదుపాయాల గురించి క్షుణ్ణంగా వివరించడం జరిగింది. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.ఎల్ సుధారాణి గారు మాట్లాడుతూ కళాశాలలో ఉన్నటువంటి ఆధునిక సౌకర్యాలను, అనుభవం కలిగిన అధ్యాపకుల గురించి, జిమ్, సైన్స్ లాబరేటరీల గురించి వివరించి, ప్రభుత్వం కల్పిస్తున్న ఉపకార వేతనాల గురించి, పోటీ పరీక్షల శిక్షణ గురించి విద్యార్థులకు అవగాహన కల్పించి వాటిని సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ గారు ,అధ్యాపక ,అధ్యాపకేతర, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం





(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, ఫిబ్రవరి 6)

మండలంలోని కరేడు పంచాయితీ అలగాయపాలెం ఎస్సీ కాలనీలో ఇటీవల జరిగిన ఆటో ప్రమాదంలో రావినూతల లక్ష్మమ్మ, రావినూతల బేబీ ప్రసన్నలు కాళ్ళు పూర్తిగా డ్యామేజీ అయ్యాయి. కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరావు ఆదేశాల మేరకు లింగసముద్రం మండలం (విఆర్‌కోట) పాటిబండ్ల మాలాద్రి నాయుడు, కుటుంబాలకు కొంత నగదు ఇచ్చి సహాయం చేశారు. ఆ కుటుంబ వాస్తవ్యులు వారికి టిడిపి పార్టీకి రుణపడి ఉంటామని తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు నేలటూరి ఆదాం, కోమట్ల వెంకటరామిరెడ్డి, గుమ్మడి శ్రీనివాసులురెడ్డి, కోమట్ల శ్రీనివాసులురెడ్డి, పెల్లేటి వెంకటరామిరెడ్డి, వాయిల శీను, వాయిల వెంకటేశ్వర్లు, పాదాల నాగిరెడ్డి, పాదాల గోపి, పాదాల కోటేశ్వరావు, గుమ్మడి సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

మొదటి పేజీ తరువాయి

# కేంద్రమంత్రితో కలిసి 'క్వాంటం వ్యాలీ'కి రేపు సీఎం చంద్రబాబు శంకుస్థాపన

ఐబీఎం, టీసీఎస్, ఎల్ అండ్ టి వంటి దిగ్గజ సంస్థలు కీలక పాత్ర పోషిస్తున్నాయి. ఈ వ్యాలీ కేవలం ఒక భవన సముదాయంగా కాకుండా, ఒక సంపూర్ణ సాంకేతిక పర్యావరణ వ్యవస్థగా అభివృద్ధి చెందనుంది. క్వాంటం కంప్యూటింగ్, క్వాంటమ్ కమ్యూనికేషన్స్, క్వాంటమ్ సెన్సార్స్ వంటి అత్యాధునిక రంగాలతో పాటు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సైబర్ సెక్యూరిటీ, డిఫెన్స్, హెల్త్‌కేర్, ఫైనాన్స్ వంటి కీలక రంగాల్లో పరిశోధనలు, ఆవిష్కరణలు, నైపుణ్యాభివృద్ధికి ఇది కేంద్రంగా మారుతుంది. దీని ద్వారా ప్రపంచ స్థాయి పరిశోధన సంస్థలు, గ్లోబల్ టెక్నాలజీ కంపెనీల పెట్టుబడులను ఆకర్షించడం, స్టార్టప్ సంస్కృతిని ప్రోత్సహించడం, లక్షలాది మంది యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం సాధ్యమవుతుందని ప్రభుత్వం ఆశిస్తోంది.

**సామాన్యుడికి ప్రయోజనాలు**

క్వాంటం టెక్నాలజీ కేవలం శాస్త్రవేత్తలకే పరిమితం కాదని, దాని ఫలాలు సామాన్యుడి జీవితంలో గణనీయమైన మార్పులు తీసుకువస్తాయని ప్రభుత్వం చెబుతోంది. ఉదాహరణకు, ఫార్మా రంగంలో పరిశోధనలు వేగవంతమై కొత్త ఔషధాలు త్వరగా అందుబాటులోకి వస్తాయి. వ్యాధుల నిర్ధారణ మరింత కచ్చితంగా మారుతుంది. వ్యవసాయ రంగంలో వాతావరణాన్ని, వర్షపాతాన్ని కచ్చితంగా అంచనా వేయడం ద్వారా రైతులు ప్రయోజనం పొందుతారు. అలాగే, బ్యాంకింగ్, డిజిటల్ లావాదేవీల భద్రత మరింత పటిష్టమవుతుంది. ఈ ఏడాది ఆగస్టు నాటికి భవన నిర్మాణం పూర్తిచేసి, డిసెంబర్ కల్లా క్వాంటం కంప్యూటర్‌ను అందుబాటులోకి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఐటీ విప్లవానికి సిలికాన్ వ్యాలీ ఎలా కేంద్రంగా నిలిచిందో, భవిష్యత్తులో క్వాంటం కంప్యూటర్ల తయారీకి, పరిశోధనలకు అమరావతి గ్లోబల్ హబ్‌గా మారుతుందని అంచనా వేస్తున్నారు.

# టీం 11... కల్తీకి, హత్యలకు బ్రాండ్ అంబాసిడర్లు

కొన్ని బూత్‌లలో వేవ్ ఉన్నా ఎందుకు గెలవలేకపోయామనే కారణాలను అన్వేషించాలన్నారు.

తన అనుభవాన్ని వివరిస్తూ, "1985 తర్వాత మంగళగిరిలో టీడీపీ జెండా ఎగరలేదు. 2019లో 5,300 ఓట్ల తేడాతో ఓడిపోయినప్పుడు కలిగిన బాధ, ఆవేదన నాలో కసి పెంచింది. ఓడిన చోటే గెలవాలని కార్యకర్తలతో కలిసి బూత్‌ల వారీగా సమీక్షించి, నాలుగేళ్లు తూచా తప్పకుండా పనిచేసి విజయం సాధించాం" అని తెలిపారు. సంస్థాగత నిర్మాణంపై నమ్మకంతోనే గెలిచానని, ఇప్పుడు అదే స్ఫూర్తితో రాష్ట్రవ్యాప్తంగా పార్టీని బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు.

**నాయకులకు, కార్యకర్తలకు దిశానిర్దేశం**

ఐదు జోన్లలో 4,772 బూత్‌లను బలోపేతం చేసేందుకు 903 మంది సీనియర్ నాయకులను నియమించినట్లు లోకేశ్ వెల్లడించారు. "ప్రతి నాయకుడు బూత్‌కు కనీసం ఒక రోజు కేటాయించి, అక్కడి పరిస్థితులను తెలుసుకుని, పార్టీ బలోపేతానికి నివేదిక ఇవ్వాలి. ఇకపై బూత్ పనితీరు ఆధారంగానే రాజకీయ భవిష్యత్తు ఉంటుంది. కష్టపడి పనిచేసిన వారికే పార్టీలో పదవులు దక్కుతాయి," అని ఆయన స్పష్టం చేశారు. పసుపు జెండా కోసం ప్రాణాలు త్యాగం చేసిన అంజిరెడ్డి తాత, మంజుల, చెన్నుపాటి గాంధీ, తోట చంద్రయ్య వంటి కార్యకర్తలే తనకు స్ఫూర్తి అని అన్నారు.

**కూటమి ప్రభుత్వ ఘనతలను వివరించాలి**

"దేశానికి వస్తున్న పెట్టుబడుల్లో 25 శాతం ఏపీకే వస్తున్నాయి. విశాఖ ఉక్కును లాభాల్లోకి తీసుకు వచ్చిన ఘనత డబుల్ ఇంజన్ బుల్లెట్ ట్రైన్ సర్కార్‌ది. విశాఖ రైల్వే జోన్ సాధించుకున్నాం. అమరావతి, పోలవరం పనులు వేగవంతం చేశాం. కర్నూలులో త్వరలోనే హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేస్తాం," అని లోకేశ్ తెలిపారు. రూ.4 వేల పింఛను, తల్లికి వందనం, అన్న క్యాంటీన్ల పునఃప్రారంభం, 16 వేల టీచర్ పోస్టుల భర్తీ వంటి సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలన్నారు.

**కూటమిలో విడాకులు ఉండవు**

"రాష్ట్ర అభివృద్ధికి ప్రభుత్వ కొనసాగింపు చాలా అవసరం. కనీసం 15 ఏళ్లు కలిసికట్టుగా ముందుకు వెళితేనే అభివృద్ధి సాధ్యమని పవనన్న చెప్పారు. మన కూటమిలో విడాకులు, మిస్ ఫైర్‌లు, క్రాస్ ఫైర్‌లు ఉండవు. ఏవైనా సమస్యలుంటే మూడు పార్టీలు కూర్చొని చర్చించుకుంటాయి. వైసీపీ మన మధ్య విభేదాలు సృష్టించేందుకు ప్రయత్నిస్తుంది, అందరూ అప్రమత్తంగా ఉండాలి" అని లోకేశ్ హితవు పలికారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుతో పాటు పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు.

# జగన్ గుంటూరు పర్యటన... పలువురు నేతలపై కేసులు నమోదు

ఈ క్రమంలో పలువురు వైసీపీ నేతలపై పోలీసులు కేసు నమోదు చేశారు.

పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం... నల్లపాడులో పోతిన మహేశ్, బలసాని కిరణ్ కుమార్ పై కేసు నమోదయింది. మంగళగిరిలో నూనె ఉమామహేశ్వర్ రెడ్డి, తాడేపల్లిలో దొంతిరెడ్డి వేమారెడ్డిపై, నగరంపాలెం ప్రాంతంలో పానుగంటి చైతన్య, నూరి ఫాతిమా, గుంటూరు పట్టాభిపురంలో అంబటి మురళిపై కేసులు నమోదయ్యాయి. ఈ సందర్భంగా పోలీసు అధికారులు మాట్లాడుతూ... వైసీపీ నేతలు చేపట్టిన ర్యాలీల కారణంగా గుంటూరులోని పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ కు అంతరాయం ఏర్పడిందని తెలిపారు. పోలీసు నిబంధనలను ఉల్లంఘించడం, అనుమతి లేకుండా ర్యాలీలు నిర్వహించడం చట్ట విరుద్ధమని చెప్పారు. ఈ క్రమంలో కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని వెల్లడించారు.

# సిక్కుల పట్ల కాంగ్రెస్ అగ్రనేతకు ఎంత ద్వేషం ఉందో ఆ మాటల్లో కనిపించింది

కనిపించిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై రాజ్యసభలో ప్రధాని మోదీ ప్రసంగిస్తూ, కాంగ్రెస్‌పై తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీని ఎంతోమంది వీడారని, కానీ ఆ పార్టీ ముఖ్య నేత మాత్రం రవ్‌నీత్ బిట్టును పార్లమెంట్ ఆవరణలో అవమానించారని మండిపడ్డారు. సిక్కుల పట్ల ఆయనకు ఉన్న ద్వేషం ఈ మాటల్లో కనిపించిందని వ్యాఖ్యానించారు. ఇదేనా మీరు తెరిచిన మొహబ్బత్ కీ దుకాణం అని ప్రశ్నించారు. ఇదే చోట ఓ ఎంపీని కాంగ్రెస్ అగ్రనేత ద్రోహి అనడం దారుణమని అన్నారు. అతనికి గర్వం తలకెక్కిందని అన్నారు. ఆ పార్టీకి దూరదృష్టి, ఎటువంటి ప్రణాళిక లేదని విమర్శించారు. కాగా, నిన్న బిట్టూ, రాహుల్ గాంధీ మధ్య మాటల యుద్ధం సాగిన విషయం తెలిసిందే. ప్రధాని మోదీ ఇంకా మాట్లాడుతూ, గరీబీ హఠావో కాంగ్రెస్ పార్టీకి ఒక నినాదం మాత్రమే అని అన్నారు. ప్రతి విషయంలో విపక్షాలు తనను నిందిస్తున్నాయని మండిపడ్డారు. నక్సలిజాన్ని అంతం చేసినందుకు తనను నిందిస్తున్నారా అని ప్రశ్నించారు. మా ప్రభుత్వంపై పేదలకు నమ్మకం పెరిగిందని అన్నారు.

# రూ.1.27 కోట్ల అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన

ప్రమాణాలు పాటించడం లేదని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే సమస్యల పరిష్కారానికి నిర్దిష్టమైన కార్యాచరణను రూపొందిస్తామని వారికి హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట జోనల్ కమిషనర్ నాగేంద్ర, జడ్పీటీసీ వెంకటప్పడు, కార్పొరేటర్ చిన్ని కుమారి లక్ష్మి, కూటమి నాయకులు విజయ్‌బాబు, తమ్మిన సూరిబాబు, రమేష్, సత్యం తదితరులు ఉన్నారు.

# ఇరాన్‌లో భారతీయులు 'చిక్కుకున్నారా?' స్పందించిన జైశంకర్

కాబట్టి అక్కడి భారతీయులను ఇరాన్‌లో చిక్కుకుపోయిన వారిగా పరిగణించడం లేదని అన్నారు. ఆ కారణంగానే ప్రత్యేకంగా తరలింపు ప్రక్రియ చేపట్టలేదని స్పష్టం చేశారు. ఇరాన్‌లోని 16 రాష్ట్రాల్లో ప్రస్తుతం 9 వేల నుంచి 10 వేల మంది భారతీయులు ఉన్నారని జైశంకర్ వెల్లడించారు. ఇందులో ఎక్కువ మంది విద్యార్థులే ఉన్నారని తెలిపారు. కార్మికులు, యాత్రికులు, పర్యాటకులు, వ్యాపారవేత్తలు, నావికులు కూడా ఉన్నట్లు తెలిపారు. స్వదేశానికి రావాలనుకునే భారతీయులకు విమానాలు అందుబాటులోనే ఉన్నాయని స్పష్టం చేశారు.

# వినాయకుని గుట్ట నందు సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

## యాగంటి మల్లికార్జునరావు

(షణ్ముఖ వెలుగు, మాచర్ల టౌన్, ఫిబ్రవరి 6)



పట్టణంలోని 28వ వార్డు వినాయకుని గుట్ట నందు రూ.21 లక్షల గల సిసి రోడ్డుకు శుక్రవారం తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు యాగంటి మల్లికార్జునరావు శంకుస్థాపన చేసారు. ఈ సందర్భంగా యాగంటి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రాష్ట్రాభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తోందని, ప్రతి వర్గానికి న్యాయం జరిగేలా సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని తెలిపారు. పేదలు, రైతులు, మహిళలు, యువతకు అండగా నిలిచే విధంగా ప్రభుత్వం అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతోందన్నారు. ముఖ్యంగా ఆరోగ్యం, విద్య, సాగునీరు, రహదారులు, తాగునీరు వంటి ప్రాథమిక అవసరాలకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని పేర్కొన్నారు. అదే విధంగా మాచర్ల నియోజకవర్గంలో కూడా అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయని మన ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి అభివృద్ధికి మారుపేరని తెలిపారు. ఇప్పటికే టౌన్ లో రహదారుల విస్తరణ, డ్రైనేజీ, తాగునీటి సరఫరా, విద్యుత్ సదుపాయాల మెరుగుదలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నారు ఏమ్మెల్యే బ్రహ్మారెడ్డి అని వెల్లడించారు. 1994 నుంచి కూడా మాచర్ల పట్టణంలో సిసి రోడ్లకి శ్రీకారం చుట్టిందే తెలుగుదేశం పార్టీ అని అలాగే పట్టణ ప్రజల నీటి వసతి కోసం మున్సిపాలిటీ నీటి ట్యాంకులు, సెంట్రల్ లైట్ ఏర్పాట్లు చేసాము అని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాచర్ల పట్టణ అధ్యక్షులు కొమెరా దుర్గారావు, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు కజ్జిం సైదయ్య, బిజెపి నాయకులు ఓర్సు కాంతి కుమార్, బూత్ ఇంచార్జి దానం బాబు, మాజీ కౌన్సిలర్ మంజుల వెంకటేశ్వర్లు, బాదం బాయ్, దేగల యాకోబు, వివిధ హోదాలలో ఉన్న కూటమి నాయకులు పాల్గొన్నారు.


# గత ప్రభుత్వం మర్చిపోయిన భవన నిర్మాణ కార్మికులను కూటమి ప్రభుత్వం మరువలేదు



## బిజెపి రాష్ట్ర నాయకులు పీవీ కృష్ణారావు

(షణ్ముఖ వెలుగు, మార్కాపురం టౌన్, ఫిబ్రవరి 6)

జిల్లా కేంద్రంలోని గడియార స్తంభం సెంటర్లో భవన నిర్మాణ కార్మికులు సంబరాలు నిర్వహించుకొని స్వీట్లు పంచుకున్నారు. ఈ సందర్భంగా పివి కృష్ణారావు మాట్లాడుతూ గత ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికులకు తీవ్ర అన్యాయం చేసిందని, వారికి కేటాయించిన నిధులు ఉన్నప్పటికీ వేరే దారి మళ్లించి భవన నిర్మాణ కార్మికులకు మొండి చేయి చూపిందని అన్నారు. కూటమి ప్రభుత్వం లో ఎవరికి అన్యాయం జరగదని అందులో భాగంగా భవన నిర్మాణ కార్మికులకు చందవలసిన పథకాలు వారికి వర్తించే విధంగా నేడు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిధులను విడుదల చేయడం ఎంతో సంతోషమని అన్నారు. కష్టాన్ని నమ్ముకున్న భవన నిర్మాణ కార్మికులకు నేడు కూటమి ప్రభుత్వం చేయూతనిస్తూ సాధారణంగా మృతి చెందిన వారికి రూ.60 వేలు యాక్సిడెంట్ బెనిఫిట్ కింద రూ.10 లక్షల వరకు వర్తిస్తుందని చెప్పారు. కుటుంబ సభ్యుల ప్రసూతి సమయంలో వారికి రెండు దఫాలుగా 20 వేల రూపాయల చొప్పున ప్రభుత్వం అందిస్తుందని అన్నారు. కార్మికుని ఇంట్లో వివాహం జరిగినట్లయితే రూ.40 వేలు ఇస్తుందని అన్నారు. కార్మికుని కుటుంబంలో ఏదైనా ఆపరేషన్ లాంటివి జరగవలసి వస్తే ఎన్టీఆర్ భరోసా కింద రూ.25 లక్షల వరకు వర్తిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో అల్లాకుల సుబ్బారావు, రాఘవేంద్ర, శేశిరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, ఎం ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.


ప్రకాశం


మార్కాపురం


బాపట్ల

షణ్ముఖ
# వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు — తెలుగు దినపత్రిక
07.02.26 శనివారం


## పర్యాటకంతో స్థానిక యువతకు ఉపాధి, ఉద్యోగాలు

**పాకాల బీచ్ ఫెస్టివల్ ను విజయవంతం చేయాలి**

**పర్యాటకం, పోర్టుతో ప్రకాశం జిల్లా మరింత అభివృద్ధి**

**పాకాల బీచ్ ఫెస్టివల్ పోస్టర్ ఆవిష్కరించిన మంత్రి గొట్టిపాటి**



**(షణ్ముఖ వెలుగు, గిద్దలూరు, ఫిబ్రవరి 6)**

పర్యాటకం అభివృద్ధి చెందితే స్థానిక యువతకు విస్తృత స్థాయిలో ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. ఏపీ టూరిజం, మారిటైమ్ బోర్డు ఆధ్వర్యంలో ప్రకాశం జిల్లా పాకాలలో ఈ నెల 14, 15 తేదీల్లో నిర్వహించనున్న బీచ్ ఫెస్టివల్ పోస్టర్‌ను శుక్రవారం నాడు గిద్దలూరులో మంత్రి గొట్టిపాటి రవి కుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రకాశం జిల్లాలో ఇప్పటికే చీరాల, సూర్యలంక బీచ్‌ల తరహాలో పాకాల బీచ్‌ను కూడా అభివృద్ధి చేస్తే వెనుకబడిన ప్రకాశం జిల్లా మరింత ముందుకు వెళ్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో టూరిజం రంగం అతిపెద్ద ఉపాధి కల్పించే రంగంగా మారుతుందని ఆయన పేర్కొన్నారు. టూరిజం ద్వారా లభించే ఉద్యోగ, ఉపాధి అవకాశాలను స్థానిక యువత సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పాకాల బీచ్‌ను ముందుగా స్థానికులే ప్రోత్సహించాలని మంత్రి గొట్టిపాటి పిలుపునిచ్చారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని ప్రజలు పాకాల బీచ్ ఫెస్టివల్ జరిగే రెండు రోజులు కుటుంబ సభ్యులతో తరువాయి 4లో...)

# విద్యుత్ ఛార్జీలు రూపాయి కూడా పెంచలేదు, ఇకపై పెంచబోము



**లో ఓల్టేజ్, అంతరాయాల పరిష్కారానికే సబ్ స్టేషన్ల నిర్మాణం**

**ఆర్డీఎస్ఎస్ తో గ్రామాల్లోనూ 24 గంటల విద్యుత్**

**అన్నదాతకు 9 గంటల నాణ్యమైన విద్యుత్ అందిస్తాం**

**పీఎం సూర్యఘర్ తో వినియోగదారునికి 30 సంవత్సరాల లబ్ధి**

**ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్**

**(షణ్ముఖ వెలుగు, గిద్దలూరు, ఫిబ్రవరి 6)**

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఇప్పటి వరకు ఒక్క రూపాయి కరెంట్ ఛార్జీ పెంచలేదని, ఇకపైనా పెంచబోమని ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పష్టం చేశారు. మార్కాపురం జిల్లా గిద్దలూరులో మంత్రి గొట్టిపాటి రవి కుమార్ గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డితో కలిసి శుక్రవారం పర్యటించారు. గిద్దలూరు నియోజకవర్గంలోని కొమరోలు మండలం కసినపల్లి గ్రామంలో రూ.3.90 కోట్లతో నిర్మించిన 33ల11 కేవీ సబ్ స్టేషన్‌ను మంత్రి గొట్టిపాటి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబు ఆదేశాలకు అనుగుణంగా లో ఓల్టేజ్, విద్యుత్ అంతరాయాల సమస్య పరిష్కారానికే సబ్ స్టేషన్ల నిర్మాణం చేపట్టామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 200 సబ్ స్టేషన్ల నిర్మాణం చేస్తున్నామన్నారు. ఆర్డీఎస్ఎస్ పథకాన్ని కూడా రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేస్తున్నామని తెలిపారు. ఆర్డీఎస్ఎస్ పథకంతో ఫీడర్ లెవల్ బైఫరికేషన్ చేపట్టామని పేర్కొన్నారు. తద్వారా గ్రామీణ ప్రాంతాల్లోనూ 24 గంటలూ విద్యుత్ సరఫరా చేయడంతో పాటు వ్యవసాయానికి నిరంతరాయంగా 9 గంటల నాణ్యమైన విద్యుత్ ను అందించే వెసులుబాటు కలుగుతుందన్నారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో ఆర్డీఎస్ఎస్ పథకంలో భాగంగా రూ.650 కోట్లతో ఫీడర్ లెవల్ బైఫర్కేషన్ పనులు జరుగుతున్నాయని మంత్రి గొట్టిపాటి స్పష్టం చేశారు. ఇందులో ఇప్పటికే 68 శాతం పనులు పూర్తయ్యాయన్నారు. ఆర్డీఎస్ఎస్ పనులు జరిగే ప్రాంతంలో విద్యుత్ అంతరాయాల వల్ల కొంత అసౌకర్యం కలుగుతుందని, పథకం వల్ల కలిగే ఉపయోగాల్ని వివరిస్తూ అధికారులే ఈ విషయాన్ని ప్రజల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. గిద్దలూరు నియోజకవర్గ పరిధిలో ఓల్టేజ్ సమస్యల పరిష్కారానికి ఇంకా ఐదు సబ్ స్టేషన్లు అవసరం అని స్థానిక ఎమ్మెల్యే అశోక్ రెడ్డి తన దృష్టికి తీసుకొచ్చారని మంత్రి తెలిపారు. ఆర్థిక వెసులుబాటు చూసుకుని ప్రాధాన్యతా క్రమంలో అన్ని పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. మార్కాపురం, కనిగిరి ప్రాంతాల్లో రిలయన్స్ సంస్థ ఏర్పాటు చేస్తున్న గ్యాస్ ప్లాంట్ వంటి సంస్థను గిద్దలూరు ప్రాంతంలోనూ ఏర్పాటు చేసే విధంగా కృషి చేస్తామన్నారు. ఎమ్మెల్యే అశోక్ రెడ్డి అడిగిన రెవెన్యూ డివిజన్ పై కూడా సీఎం సానుకూలంగా స్పందించారని మంత్రి వివరించారు.

**రూ.7000 కోట్లతో రాష్ట్ర వ్యాప్తంగా పనులు...**

రాబోయే రోజుల్లో ఒక్క రూపాయి బిల్లు పెంచకుండా నాణ్యమైన విద్యుత్ ను ప్రజలకు అందించాలన్నదే కూటమి ప్రభుత్వ ఉద్దేశమని మంత్రి గొట్టిపాటి వెల్లడించారు. తరువాయి 4లో...)



## జిల్లా మైనింగ్ కార్యాలయంలో ఏసీబీ తనిఖీలు

**ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉండటం పై**

**సర్వేయర్‌ను అదుపులోకి తీసుకున్న అధికారులు**

**బంధువుల ఇళ్లల్లో కూడా సోదాలు**



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఫిబ్రవరి 6)**

గనులు, భూగర్భ ఖనిజాల శాఖ జిల్లా కార్యాలయంలో ఏసీబీ అధికారులు శుక్రవారం దాడులు నిర్వహించారు. ఆదాయాన్ని మించి ఆస్తులు కలిగి ఉన్న ఆ శాఖ సర్వేయర్ అబ్దుల్ ఆసిఫ్‌ను అధికారులు అదుపులోకి తీసుకొని విచారణ నిమిత్తం విజయవాడకు తరలించారు. అబ్దుల్ ఆసిఫ్ కు సంబంధించిన ఆస్తుల వివరాలు రాబట్టేందుకు ఏకకాలంలో కనిగిరి, మార్కాపురం, ఒంగోలు, విజయవాడలలో బంధువుల ఇళ్లలో సైతం అధికారులు సోదాలు నిర్వహించారు. తరువాయి 4లో...)

## ఒంటరి మహిళ హత్య కేసులో ముద్దాయి అరెస్ట్

**కనిగిరి డిఎస్పీ పి సాయి ఈశ్వర్ యశ్వంత్**

**(షణ్ముఖ వెలుగు, పొదిలి, ఫిబ్రవరి 6)**

మండలంలోని గోగినేనివారిపాలెం గ్రామంలో డిసెంబర్ 18వ తేదీ రాత్రి జరిగిన హత్య కేసులో ముద్దాయిని అరెస్టు చేసినట్లు కనిగిరి డిఎస్పీ పి సాయి ఈశ్వర్ యశ్వంత్ తెలిపారు. పొదిలి సర్కిల్ కార్యాలయంలో శుక్రవారం ఉదయం డిఎస్పీ మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోగినేనివారిపాలెం ఎస్సీ కాలనికి చెందిన పులి బుల్లమ్మ(49) కుమారులు ఇతర ప్రాంతాలకు ఉపాధి కోసం వెళ్ళగా ఆమె ఒంటరిగా నివసిస్తుంది. కొద్ది నెలల క్రితం భర్త మల్లికార్జున్ చనిపోవడంతో ఒంటరిగా ఉంటోంది. మృతురాలు ఇంటికి సమీపంలో ఉన్న ముద్దాయి మెడబలిమి ఏడుకొండలుకు అనేక మంది మహిళలతో అక్రమ సంబంధం కలిగి ఉన్నట్లు మృతురాలి ద్వారా తెలుసుకున్న ముద్దాయి భార్య అతనితో గొడవపడి పిల్లల్ని తీసుకుని పుట్టింటికి వెళ్ళిపోయింది. అప్పటినుంచి బుల్లెమ్మ పై పగ పెంచుకున్న ముద్దాయి ఏడుకొండలు ఒంటరిగా ఉన్న బుల్లెమ్మ పై కక్ష సాధింపుతో ఎలాగైనా అనుభవించాలని లైంగిక కోరిక పెంచుకున్నాడు. ఈ క్రమంలో ఒక పథకం ప్రకారం డిసెంబర్ 18వ తేదీ రాత్రి బుల్లెమ్మ ఇంటిలోకి ప్రవేశించి తన కోరిక తీర్చవలసిందిగా తీవ్రంగా ఒత్తిడి చేసినట్లు తెలిసింది. ఆమె అందుకు నిరాకరించడంతో విషయం బయటకు తెలిస్తే గ్రామంలో పరువు పోతుందని, గొడవలు అవుతాయని భావించిన ముద్దాయి ఏడుకొండలు అక్కడే షోకేస్‌లో ఉన్న ప్లాస్టిక్ తాడుతో ఆమె మెడకు బిగించి ఊపిరి ఆడకుండా తరువాయి 4లో...)



# రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమానికి పెద్దపీట వేస్తోంది



**భూ సమస్యల పరిష్కరం మండలస్థాయిలోనే జరగాలి**

**భూమి ఉన్న ప్రతి రైతు భూమిలో పంటలు పెట్టాలి**

**ప్రకృతి వ్యవసాయం ద్వారా అధిక ఆదాయం**

**ప్రజలు అధికారులకు సహకరించాలి**

**కుటుంబ భూ సమస్యలు వారే పరిష్కరం చేసుకోవాలి**

**జిల్లా కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్**



**(షణ్ముఖ వెలుగు, బాపట్ల, ఫిబ్రవరి 6)**

భూ సంబంధిత సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రీసర్వే "మీ భూమి–మీ హక్కు" కార్యక్రమమని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్ తెలిపారు. శుక్రవారం రేపల్లె నియోజకవర్గం, నగరం మండలం, పెద్దవరం గ్రామంలో రిసర్వే పూర్తి అయిన అనంతరం రాజముద్రతో ముద్రించిన భూహక్కు పత్రాలు, పట్టదారు పాస్‌బుక్స్ (మీ భూమి–మీ హక్కు) పంపిణీ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, భూ సంబంధిత సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రీ సర్వే "మీ భూమి–మీ హక్కు" కార్యక్రమం ద్వారా రైతులకు స్పష్టమైన భూ హక్కులు లభిస్తున్నాయని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు గారు గత సంవత్సరము నుంచి చెబుతున్నారు రైతుల భూ సమస్యలను పరిష్కరం చేయాలని, రెవెన్యూ సమస్యలకు సంబంధించి జిల్లా కలెక్టర్లు బాధ్యత తీసుకోవాలని ఆదేశాలు ఇవ్వడం జరిగిందన్నారు. రీసర్వే పూర్తయ్యాక శాస్త్రీయంగా రూపొందించిన భూహక్కు పత్రాలు, పట్టదారు పాస్‌బుక్స్ రాజముద్రతో జారీ చేయడం వల్ల భూమి యాజమాన్యంపై ఎలాంటి సందేహాలకు తావు ఉండదన్నారు. రిసర్వే ప్రక్రియలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి భూముల సరిహద్దులు, విస్తీర్ణం ఖచ్చితంగా నిర్ధారించామన్నారు. దీని ద్వారా భూ వివాదాలు తగ్గడమే కాకుండా, రైతులకు బ్యాంకు రుణాలు, ప్రభుత్వ పథకాలు సులభంగా అందే అవకాశం ఉంటుందని అన్నారు. ఈ గ్రామంలో 355 మంది రైతులకు పాస్ బుక్స్ ఉన్నాయని, శుక్రవారం 276 మంది రైతులకు పాస్ బుక్స్ అందజేయడం జరిగిందని, మిగిలిన 49 మంది రైతుల పుస్తకాల్లో కొన్ని తప్పులు వచ్చాయన్నారు. వాటిని కూడా మళ్లీ ప్రభుత్వానికి పంపించి సరి చేసిన తర్వాత వచ్చే నెల రైతులకు పట్టాదార్ పాస్ పుస్తకాలు పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. (భూహక్కు పత్రాలు,) పాస్‌బుక్స్‌ను జాగ్రత్తగా భద్రపరుచుకోవాలని రైతులకు కలెక్టర్ సూచించారు. రెవిన్యూ సమస్యలు రెవిన్యూ అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలను పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని సబందిత అధికారులను ఆదేశించారు. మీ భూమి పై మీరు ఏదో ఒక రకమైన పంట వేసుకొని ఉండాలన్నారు. రైతులు ప్రకృతి వ్యవసాయం చేయడం ద్వారా పంటలు వేసుకుంటే తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం సంవత్సరం పొడుగునా ఆదాయం వస్తున్నారు. జిల్లా నుండి ఇతర పట్టణాలకు వలసలు వెళుతుంటారని అలా వెళ్లకుండా జిల్లాలోని అన్ని గ్రామాలలోని డ్వాక్రా సంఘంలో ఉన్న ప్రతి మహిళలకు ఏదో ఒకటి చేతివృత్తుల ద్వారా వివిధ రకాల వస్తువుల తయారు చేయించే విధంగా వారికి అదనపు ఆదాయం వచ్చే విధంగా జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. జిల్లాలో జెసి,ఆర్డీఓలు,తహశీల్దార్లు రీ సర్వే కార్యక్రమాన్ని విజయవంతం చేసిన రెవెన్యూ అధికారులు, సర్వే సిబ్బంది, గ్రామస్థులను అభినందనలు తెలిపారు. (తరువాయి 4లో...)

# విద్యుత్ ఛార్జీలు రూపాయి కూడా పెంచలేదు, ఇకపై పెంచబోము







దానికి అవసరం అయిన 132, 220, 400 కేవీ వంటి సబ్ స్టేషన్లతో పాటు పవర్ లైన్ పనులను రాష్ట్ర వ్యాప్తంగా సుమారు రూ.7 వేల కోట్లతో చేపట్టామన్నారు. ఒక్క గిద్దలూరు నియోజకవర్గంలోనే రూ.90 కోట్లతో ఆర్డీఎస్ఎస్ పనులు జరుగుతున్నాయన్నారు. ఇందులో రూ.70 కోట్ల పనులు ఇప్పటికే పూర్తయ్యాయన్నారు. ఆర్డీఎస్ఎస్ నిధులతో పనులను త్వరితగతిన పూర్తి చేస్తే., కేంద్ర ప్రభుత్వాన్ని మరిన్ని నిధులు కోరే అవకాశం ఉంటుందని, అధికారులు ఆ దిశగా పనులను వేగవంతం చేయాలని మంత్రి సూచించారు. రాష్ట్ర చరిత్రలో ఎప్పుడూ లేని విధంగా, ఎవరూ చేయని విధంగా 13 పైసలు ట్రూ డౌన్ చేశామన్నారు. దీనితో పాటు జగన్మోహన్ రెడ్డి ట్రూ అప్ చేసిన 40 పైసలను పూర్తిగా డౌన్ చేయడంతో పాటు, రాబోయే రోజుల్లో ఒక్కో యూనిట్ పై రూ.1.19 పైసలు తగ్గించే దిశగా పని చేస్తున్నామన్నారు. జగన్మోహన్ రెడ్డి ఆధ్వర్యంలోని గత వైసీపీ ప్రభుత్వంలో అధిక ధరలకు విద్యుత్ కొనుగోళ్లు చేసి ప్రజలపై రూ.30 వేల కోట్ల భారం వేశారన్నారు. 9 సార్లు విద్యుత్ ఛార్జీలను పెంచారని విమర్శించారు.

**సూర్యఘర్ తో 30 ఏళ్ల లబ్ధి....**

కేంద్ర ప్రభుత్వ సహకారంతో అమలవుతున్న పీఎం సూర్యఘర్ పథకాన్ని అందరూ వినియోగించుకోవాలని మంత్రి గొట్టిపాటి పిలుపునిచ్చారు. సూర్యఘర్ పథకాన్ని వినియోగించుకునే లబ్ధిదారులకు రూ.78 వేల ప్రభుత్వ సబ్సిడీ ఉంటుందని వివరించారు. ఎస్సీ, ఎస్టీ వినియోగదారులకు పూర్తి ఉచితంగా ఈ పథకాన్ని అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. సూర్యఘర్ పథకం ద్వారా సోలార్ ప్యానల్స్ ను ఇంటిపై ఏర్పాటు చేసుకుంటే సుమారు 30 సంవత్సరాల వరకు లబ్ధి కలుగుతుందన్నారు. ఎక్కువ సోలార్ విద్యుత్ ను ఉత్పత్తి చేస్తే అదనపు లాభం కూడా కలుగుతుందని మంత్రి గొట్టిపాటి వివరించారు. రాష్ట్రంలోని ఒక్కో నియోజకవర్గంలో 10 వేల మంది గృహ వినియోగదారులు సూర్యఘర్ పథకంలో భాగం అయ్యే వెసులుబాటు ఉందన్నారు. అదే విధంగా పీఎం కుసుమ్ తో రైతులకూ సోలార్ విద్యుత్ అందిస్తామన్నారు.

**132/33 కేవీ సబ్ స్టేషన్ ను పరిశీలించిన మంత్రి గొట్టిపాటి...**

మార్కాపురం జిల్లా పర్యటనలో భాగంగా గిద్దలూరులో ఉన్న 132ల33 కేవీ సబ్ స్టేషన్ ను మంత్రి గొట్టిపాటి సందర్శించారు. సబ్ స్టేషన్ పనితీరు, విద్యుత్ లోడు వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యుత్ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా గిద్దలూరులో 220 కేవీ సబ్ స్టేషన్ తో పాటు డివిజనల్ కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలన్న స్థానిక ఎమ్మెల్యే అశోక్ రెడ్డి విజ్ఞప్తికి మంత్రి గొట్టిపాటి సానుకూలంగా స్పందించారు. సబ్ స్టేషన్లపై లోడ్ పడకుండా అవసరమైన చోట నూతన సబ్ స్టేషన్ల నిర్మాణాలకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలనిర స్థానిక అధికారులకు సూచించారు. అదే విధంగా 220 కేవీ సబ్ స్టేషన్, డివిజనల్ ఆఫీస్ కు సంబంధించి డీపీఆర్ లు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

## బడ్జెట్ సమావేశాలు అర్థవంతంగా జరగాలి

### చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు




**(షణ్ముఖ వెలుగు, వినుకొండ, ఫిబ్రవరి 6)**

ఈ నెల 11 నుంచి జరగబోయే ఆంధ్రప్రదేశ్ బడ్జెట్ సమావేశాలు అర్ధవంతంగా జరగాలని, సామాన్య ప్రజలకు ఉపయోగపడే అంశాలు చర్చ జరిగి, నిర్ణయాలు తీసుకునేలా ఉండాలని ప్రభుత్వ చీఫ్‌విప్ శ్రీ జీవీ ఆంజనేయులు అన్నారు. శుక్రవారం టీడీఎల్పి కార్యాలయంలో ప్రభుత్వ విప్‌ల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అసెంబ్లీ సమావేశాలకు ఎమ్మెల్యేలు 100% శాతం హాజరు కావాలని, హజరైన వారు కూడా సభ జరిగినంత సేపు హాలులో వుండి సభాగౌరవాన్ని కాపాడాలని కోరారు. ప్రతిపక్ష వైసీపీ సభ్యులు కూడా సభకు హజరై తమ గౌరవాన్ని కాపాడుకోవాలని, ప్రజా సమస్యల పట్ల తమ చిత్తశుద్ధి నిరూపించుకోవాలని అన్నారు. చంద్రబాబునాయుడు నాయకత్వంలో ఈ నెల 14వ తేదీన జనరంజక బడ్జెట్ ప్రవేశపెట్టబోతున్నారని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ఛీఫ్‌విప్ జీవీ ఆంజనేయులుతో పాటు ప్రభుత్వ విప్‌లు కాల్వ శ్రీనివాసులు, పిజివిఆర్ నాయుడు ( గణబాబు), యార్లగడ్డ వెంట్రావు, బోలిశెట్టి శ్రీనివాస్, బొమ్మిడి నాయకర్, యనవమల దివ్య, తంగిరాల సౌమ్య, టీడీఎల్పి సెక్రటరి కోనేరు సురేష్, తదితరులు పాల్గొన్నారు.

## వ్యక్తిగత పరిశుభ్రతతో ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు




**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఫిబ్రవరి 6)**

సరైన అవగాహన కలిగి, వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం ద్వారా రుతుక్రమ సంబంధిత సమస్యలు రాకుండా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని జాయింట్ కలెక్టర్ కల్పనాకుమారి చెప్పారు. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ లో భాగంగా సింహపురి ఎక్స్ప్రెస్ లిమిటెడ్ ప్రతినిధులు శుక్రవారం ఒంగోలులోని దామచర్ల సక్కుబాయమ్మ డిగ్రీ కాలేజీలో ‘ మేకింగ్ ది డిఫరెన్స్ ’ చారిటబుల్ ట్రస్ట్ తో కలిసి ‘లజ్జ’ పేరుతో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. రుతుక్రమ సమయంలో శానిటరీ ప్యాడ్స్ వినియోగించాల్సిన తీరు, సంప్రదాయ ప్యాడ్స్ వినియోగించడం వలన పర్యావరణానికి కలిగే నష్టంపై అవగాహన కలిగించేలా ఈ కార్యక్రమాన్ని వహిస్తున్నట్లు ప్రతినిధులు చెప్పారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ మహిళలందరికీ సహజమైన రుతుక్రమంపై కిశోరప్రాయం నుంచే బాలికలకు అవగాహన అవసరమన్నారు. శుభ్రమైన ఆహారం తీసుకుంటూ, వ్యక్తిగత శుభ్రత పాటించడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చన్నారు. సామాజిక అడ్డంకులను అధిగమించి రుతుక్రమ సంబంధిత సమస్యలపై స్వేచ్ఛగా చర్చించాలన్నారు. ఈ దిశగా అవగాహన కల్పిస్తున్న సింహపురి ఎక్స్ప్రెస్ లిమిటెడ్ ‘మేకింగ్ ది డిఫరెన్స్’ చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులను ఆమె అభినందించారు. ఈ సందర్భంగా 650 మంది విద్యార్థినులకు ‘రీ యూజబుల్’ పర్యావరణ అనుకూల సానిటరీ పాడ్స్ కిట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ సిహెచ్ శ్రీనివాసరావు, సింహపురి ఎక్స్ప్రెస్ లిమిటెడ్ ఆపరేషనల్ మేనేజర్ జి శ్రీనివాసులు, టోల్ మేనేజర్ కె దీపిక, చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధి గైక్వాడ్, కళాశాల అధ్యాపకులు, ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.

## పర్యాటకంతో స్థానిక యువతకు ఉపాధి, ఉద్యోగాలు



కలిసి వచ్చి ఆహ్లాదకర వాతావరణంలో ఎంజాయ్ చేయాలని కోరారు. చీరాల, సూర్యలంక బీచ్‌ల పరిసర ప్రాంతాల్లో ప్రస్తుతం సుమారు 1100 రూములు పర్యాటకులకు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అదే విధంగా పాకాల బీచ్‌ను కూడా అభివృద్ధి చేసి పర్యాటకులకు అనుకూలంగా మార్చే దిశగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఇందుకు స్థానికుల సహకారం ఎంతో అవసరమని స్పష్టం చేశారు. పాకాల బీచ్ ఫెస్టివల్‌ను విజయవంతం చేయాలని మంత్రి కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాజాబాబు, ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి, టూరిజం శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమానికి పెద్దపీట వేస్తోంది


ప్రతి శనివారం జిల్లా కలెక్టరేట్లో సీనియర్ సిటిజన్ కు నిర్వహించే కోర్టు కేసులో కూడా ఎక్కువ భూ సమస్యలకు సంబంధించి వస్తుంటాయని తెలిపారు. కొన్ని కుటుంబంలోనే భూ సమస్యలకు సంబంధించి రైతులు రెవెన్యూ అధికారుల వద్దకు రావడం జరుగుతుందని తెలిపారు. కొన్ని కుటుంబాలలోని భూ సమస్యలు రెవిన్యూ అధికారులు పరిష్కారం చేయలేరని తెలిపారు. భూమి ఉన్న రైతులు అందరికీ ఒక విన్నపం 65 సంవత్సరం నిండిన ప్రతి రైతు తమకున్న భూమిని పిల్లలు అందరికి సమానంగా వ్రాసివివ్వండి, ఇంకా ఎప్పటికి ఆ కుటుంబంలో భూ సమస్యలు రావని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ హరే రామ్, ఆర్డీఓ యన్ రామలక్ష్మి, తహశీల్దార్ నాచారయ్య, జడ్పీటీసీ నాగలక్ష్మి, ప్రజా ప్రతినిధులు అనగాని శివ ప్రసాద్, రైతులు, గ్రామ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

## ఒంటరి మహిళ హత్య కేసులో ముద్దాయి అరెస్ట్

చేసి హత్య చేశాడన్నారు. అనంతరం ఎవరికీ అనుమానం రాకుండా ఇంటి నుంచి పారిపోయిన ముద్దాయి ఏడుకొండలు ఆచూకీ తెలుసుకోవడం కష్టమైంది. ఎటువంటి సీసీ కెమెరాలు అందుబాటులో లేకపోవడంతో ముద్దాయిని గుర్తించడం కష్టమైనప్పటికీ సిఐ రాజేష్ కుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక పోలీసు బృందం ఇరుగు పొరుగు వారితో బాగా విచారించిన అనంతరం ముద్దాయి ఏడుకొండల కోసం గాలిస్తున్నామన్నారు. ఈ క్రమంలో తన చుట్టూ పోలీసులు ఉచ్చు బిగుస్తుందని గమనించిన ముద్దాయి గురువారం గ్రామ రెవెన్యూ అధికారి కిలారి సుబ్బారావు ఎదుట లొంగిపోయి అంగీకరించినట్లు తెలిపారు. ఈ క్రమంలో నిందితుడిని గుర్తించేందుకు తనతో పాటు పొదిలి సర్కిల్ ఇన్స్పెక్టర్ రాజేష్ కుమార్, పొదిలి పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ సయ్యద్ ఎండి షాకీర్, కానిస్టేబుల్ ఎం కోటేశ్వరరావులను జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.




## నాగులప్పలపాడు నూతన ఎస్ఐగా బీవీ మహేంద్ర నాయక్



**(షణ్ముఖ వెలుగు, నాగులుప్పలపాడు, ఫిబ్రవరి 6)**

నాగులప్పలపాడు నూతన ఎస్ఐగా బీవీ మహేంద్ర నాయక్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం అక్కడ విధులు నిర్వహిస్తున్న ఎస్ఐ షేక్ రజియా సుల్తానా బేగం మెడికల్ లీవ్ పై వెళ్ళారు. జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్‌రాజు ఉత్తర్వుల మేరకు బీవీ మహేంద్ర నాయక్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఎస్ఐ మహేంద్ర నాయక్ గతంలో కందుకూరు, నెల్లూరు జిల్లాలో ఎస్ఐగా విధులు నిర్వహించారు.

## జిల్లా మైనింగ్ కార్యాలయంలో ఏసీబీ తనిఖీలు





# గ్రామాల అభివృద్ధికి సహకరించండి
## జిల్లా పంచాయతీ అధికారి ఎం వెంకటేశ్వరరావు





**(షణ్ముఖ వెలుగు, పెద్దారవీడు, ఫిబ్రవరి 6)**

గ్రామాల అభివృద్ధికి ప్రజలు సహకరించాలని జిల్లా పంచాయతీ అధికారి ఎం వెంకటేశ్వరరావు కోరారు. మండలంలోని కంభంపాడు, తోకపల్లి గ్రామపంచాయతీ ఎస్సీ కాలనీలో శుక్రవారం నిర్వహించిన ఫీల్డ్ విజిట్ సందర్భంగా సంబంధిత సిబ్బందికి ఆయన పలు సూచనలు చేశారు. ఫిబ్రవరి 15వ తేదీ నాటికి టాక్స్, నాన్-టాక్స్ కలెక్షన్ 100% పూర్తి చేయవలసిందిగా ఆదేశించారు. దీనికి సంబంధించి ప్రణాళికాబద్ధంగా కార్యాచరణ రూపొందించి, నిర్ణయించిన టార్గెట్ సాధించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామ ప్రజలతో మాట్లాడినప్పుడు వారు మాకు తాగునీటి సమస్యను పరిష్కరించాలని సాగర్ నీళ్లు కావాలని అడిగారు. జల్ జీవన్ మిషన్ ద్వారా ఇంటింటికి కుళాయి ఏర్పాటు చేస్తామని తెలియజేశారు. అదే విధంగా గ్రామ



ప్రజలందరూ ఇంటి పన్నులు గ్రామ పంచాయతీకి చెల్లించి గ్రామ అభివృద్ధికి సహకరించాలని కోరారు. ప్రతిరోజూ ఉదయం 6 గంటల నుంచి 9 గంటల వరకు ఫీల్డ్‌లో ఉండి, గ్రీన్ అంబాసిడర్స్‌తో సమన్వయం చేసుకుంటూ ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. పాంప్లెట్లు పంపిణీ చేయడం, ముఖ్యంగా డ్వాక్రా సంఘాలతో మీటింగ్స్ నిర్వహించడం ద్వారా కాల్స్‌లో సానుకూల స్పందన 100 శాతం పెరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వర్మీ కంపోస్ట్ తయారీ, చెత్త నుండి సంపద కేంద్రంలోకి వచ్చిన తడి చెత్తను సక్రమంగా వర్గీకరించి, తడి చెత్తను వానపాముల ద్వారా వర్మీ కంపోస్ట్ తయారు చేయాల్సిందిగా ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మండల పరిషత్ అభివృద్ధి అధికారి వి శ్రీనివాస్, పంచాయతీ డెవలప్మెంట్ అధికారి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## 9న ఏపీఓ కార్యాలయాల ఎదుట ధర్నాలు




**(షణ్ముఖ వెలుగు, గోపవరం, ఫిబ్రవరి 6)**

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని బలహీనపరిచే ప్రయత్నాలను కేంద్ర ప్రభుత్వం ఆపాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం కడప జిల్లా అధ్యక్షుడు వీరశేఖర్, జిల్లా కార్యదర్శి సి.సుబ్రమణ్యం డిమాండ్ చేశారు. ఈ చట్టం వల్ల గ్రామీణ పేదలకు ఉపాధి లభించిందని, అయితే నిధుల కోతలతో పథకం భవిష్యత్ ప్రమాదంలో పడుతోందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతి గ్రామీణ కుటుంబానికి 100 రోజుల పని కల్పించాలన్న లక్ష్యం నెరవేరే పరిస్థితి కనుమరుగవుతోందని, ఈ పథక నిధులను ఇతర రంగాలకు మళ్లించే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఉపాధి హామీ పథకం పేదలకు హక్కుగా మారిందని, దాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిదేనని తెలిపారు. ఈనెల 9వ తేదీన జిల్లాలోని ఏపీఓ కార్యాలయాల ఎదుట వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ధర్నాలు నిర్వహించనున్నట్లు ప్రకటించారు. ఈ ధర్నాలను జయప్రదం చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సమితి సభ్యులు పడిగే వెంకటరమణ, సిపిఐ గోపవరం మండల కార్యదర్శి గూడూరు పెంచలయ్య, వ్యవసాయ కార్మిక సంఘం ఏరియా అధ్యక్షుడు పొంగూరు నాగరాజు, గోపవరం మండల కార్యదర్శి ఎస్ఏ ఖాదర్ బాషా, తదితరులు పాల్గొన్నారు.

## పీ4 స్ఫూర్తితో బాపట్ల సేవాసేతుకు విశేష స్పందన
### జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్



***(షణ్ముఖ వెలుగు, బాపట్ల, ఫిబ్రవరి 6)***

పీ 4 స్ఫూర్తిగా జిల్లాలో ప్రారంభించిన బాపట్ల సేవాసేతు కార్యక్రమానికి అన్ని వర్గాల నుంచి మంచి స్పందన లభిస్తోందని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్ తెలిపారు. కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో జిల్లా ఎక్సైజ్, ప్రొహిబిషన్ అధికారి సిహెచ్ నరేష్ ఒక ఇన్సినిరేటర్ పరికరాన్ని జిల్లా కలెక్టర్‌కు అందజేశారు. ఈ ఇన్సినిరేటర్‌ను చీరాల ఏపీ మోడల్ స్కూల్‌కు అందించినట్లు కలెక్టర్ తెలిపారు. సమాజ సేవ చేయాలనే భావన ఉన్న వారికి బాపట్ల సేవాసేతు ఒక చక్కటి వేదికగా నిలుస్తోందని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్ సింగ్, తదితరులు పాల్గొన్నారు.

# ఎల్ఆర్ఎస్, బీపీఎస్ స్కీంల గురించి సమావేశం



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఫిబ్రవరి 6)**

ఒంగోలు నగర పాలక సంస్థ కమీషనర్ ఛాంబర్‌లో శుక్రవారం ఎల్ఆర్ఎస్, బీపీఎస్ స్కీంల గురించి సమావేశం ఏర్పాటు చేసారు. ఇందులో భాగంగా కమీషనర్ కోడూరు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ స్కీం జనవరి 23, 2026వ తేదీతో గడువు ముగిసిన మరలా మూడు నెలలు అనగా ఏప్రిల్ 23, 2026 వరకు పొడిగించటం జరిగింది. ఈ నేపథ్యంలో ఎల్ఆర్ఎస్ స్కీం ప్రక్రియను ఎల్‌టీపీలు అక్రమ లేఔట్ లు క్రమబద్దీకరణ చేయించుకొని బిల్డింగ్స్ ను క్రమబద్దీకరణ చేయించుకోమని చెప్పియున్నారు. అక్రమ లేఅవుట్‌లు క్రమబద్ధీకరణ చేఇంచు కొని వాళ్ళను బ్లాక్ లిస్టులో పెట్టడం జరుగుతుందన్నారు. అలానే బీఆర్ఎస్ స్కీం మార్చి 11, 2026వ తేదీతో గడువు ముగుస్తున్నందున డీవీఏషన్ ఉన్న ప్లాట్స్ క్రమబద్ధీకరణ చేయించుకోమని తెలిపారు. ఎల్‌టీపీలు అందరు బీపీస్ స్కీం ఇంప్లీమెంటేషన్ లో ప్లాట్స్ ఓనర్స్ అందరికి అవగాహన కల్పించి బీఆర్ఎస్ స్కీం లో క్రమబద్ధీకరణ చేయించుకొని వాళ్ళను బ్లాక్ లిస్టులో పెట్టడం జరుగుతుందన్నారు. వారి ప్లాట్స్‌కు రిజిస్ట్రేషన్ జరగకుండా చేయుటం జరుగుతుందని కమీషనర్ తెలిపారు. ఇప్పటివరకు ఈ స్కీం ద్వార 7.0 కోట్ల ఆదాయం ఒంగోలు నగర పాలక సంస్థకు రావటం జరిగిందన్నారు. రాష్ట్రంలో ఒంగోలు నగర పాలక సంస్థ ప్రగతి సాదించటంలో అందరు తమవంతు కృషి చేసినందుకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కమీషనర్ కోడూరు వెంకటేశ్వరరావు, రసూల్, ఎల్‌టీపీలు పాల్గొన్నారు.

## విద్యార్థులు ఉన్నత లక్ష్యంతోనే చదవాలి
### తహసీల్దార్ కృష్ణారెడ్డి





**(షణ్ముఖ వెలుగు, పొదిలి, ఫిబ్రవరి 6)**

పాఠశాల, కళాశాల స్థాయిలో విద్యార్థులు ఒక ఉన్నత లక్ష్యంతోనే చదవాలని పొదిలి తహసీల్దార్ ఎంవీ కృష్ణారెడ్డి సూచించారు. గురువారం స్థానిక వీరిశెట్టి విద్యాసంస్థల ఫేర్వెల్ ఫంక్షన్ సరిగా ఆవరణలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన తహసీల్దార్ ఎంవి కృష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి తన జీవితంలో ఏమి సాధించాలో దానిని ఒక లక్ష్యంగా ఎంచుకోవాలన్నారు. ఆ లక్ష్య సాధనలో మంచి మిత్రులను ఎంచుకోవాలని ఎన్ని అవాంతరాలు ఎదురైనా లక్ష్యాన్ని మరవకూడదని హెచ్చరించారు. ప్రస్తుతం మారుతున్న సమాజంలో సోషల్ మీడియా ప్రభావంతో విద్యార్థులు చెడు దారి పట్టి చెడు వ్యసనాలకు బానిసలయ్యే ప్రమాదం ఉందని వాటి పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. తల్లిదండ్రుల సూచనలు ఎప్పుడు పెడచెవిన పెట్ట వద్దని హెచ్చరించారు. రేపటి బంగారు భవిష్యత్తు కోసం నేడు విద్యార్థులుగా కష్టపడాల్సిందే బాధ్యత తప్పదన్నారు. మంచి మిత్రులు ఎంచుకొని మంచి లక్ష్యాలు సాధించాలని విద్యార్థులకు సూచించారు. కళాశాల కరస్పాండెంట్ మద్దుల శ్రీనివాసులు మాట్లాడుతూ సమాజానికి ఉపయోగపడే వ్యక్తులుగా రావాలని విద్యార్థులకు సూచించారు.

# ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా పార్టీ నాయకులు పనిచేయాలి

### చీఫ్ విప్ జీవి ఆంజనేయులు
### మంగళగిరి టీడీపీ కేంద్ర కార్యాలయంలో పార్లమెంట్ అధ్యక్షుల శిక్షణ
### అరకు పార్లమెంట్‌తో ప్రత్యేక సమావేశం



**(షణ్ముఖ వెలుగు, వినుకొండ, ఫిబ్రవరి 6)**

మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన పార్లమెంట్ అధ్యక్షులు, పరిశీలకుల శిక్షణ కార్యక్రమంలో ప్రభుత్వ చీఫ్ విప్ జీవి ఆంజనేయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అరకు పార్లమెంట్ అధ్యక్షులు, పరిశీలకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి, నియోజకవర్గాల వారీగా ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై సుదీర్ఘంగా చర్చించారు. కూటమి ప్రభుత్వ విధానాలు, అభివృద్ధి కార్యక్రమాలు ప్రజల్లోకి సమర్థవంతంగా తీసుకెళ్లే బాధ్యతను పార్టీ నాయకులు, పరిశీలకులు సమన్వయంతో నిర్వర్తించాలని సూచించారు. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య



వారధిగా నిలుస్తూ, పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసే దిశగా అంకితభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. బూత్ స్థాయి నుంచి పార్లమెంట్ స్థాయి వరకు పార్టీ వ్యవస్థను మరింత పటిష్టం చేయడంపై దిశానిర్దేశం చేశారు. రాబోయే రాజకీయ



సవాళ్లను ధైర్యంగా ఎదుర్కొనేలా పార్టీ క్యాడర్ సిద్ధంగా ఉండాలని సూచించారు. తెలుగుదేశం పార్టీ సిద్ధాంతాలు, ప్రజా సంక్షేమ లక్ష్యాలను గ్రామ స్థాయి వరకు తీసుకెళ్లడమే లక్ష్యంగా పని చేయాలని తెలిపారు. పార్టీ విజయంలో ప్రతి కార్యకర్త, నాయకుడి పాత్ర కీలకమని చీఫ్ విప్ స్పష్టం చేశారు.

## నేడు మార్కాపురం రూరల్ ఎస్ఐగా బాధ్యతలు చేపట్టన్ను ఉన్నం వేమన




**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, ఫిబ్రవరి 6)**

మార్కాపురం రూరల్ పోలీస్ స్టేషన్ ఎస్ఐగా శనివారం సాయంత్రం 5 గంటలకు ఉన్నం వేమన రూరల్ స్టేషన్‌లో బాధ్యతలు చేపట్టనున్నారు. ప్రస్తుతం మార్కాపురం రూరల్ ఎస్ఐగా పని చేస్తున్న అంకమ్మరావు విఆర్‌కు బదిలీ అయ్యారు. ఉన్నం వేమన పొదిలి ఎస్ఐగా ఏడాదిన్నర పాటు పని చేశారు. ఆయన పని చేసిన కాలంలో ఎలాంటి శాంతిభద్రతలకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకున్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో తన మార్కు చూపించారు. కొన్ని అనుకోని సంఘటనలతో ఆయన విఆర్‌కు వెళ్ళారు.

# రోడ్డు భద్రత పై అవగాహన కార్యక్రమం





(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, ఫిబ్రవరి 6)

మండలంలో జాతీయ రహదారి పక్కనే గుణ హోటల్ ఎదురుగా శుక్రవారం సాయంత్రం రహదారి భద్రత పై కందుకూరు సిఐ అన్వర్ భాష, ఉలవపాడు ఎస్ఐ జి సుబ్బారావు ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. సుమారు 50 మంది వాహన దారులు ఈ సదస్సులో పాల్గొన్నారు. జాతీయ రహదారి మీద ఓవర్ లోడింగ్‌తో ఆటోలు ప్రయాణించకూడదని, పెద్ద ఆటో లలో డ్రైవర్‌తో కలిపి 7 మంది, చిన్న ఆటోలో డ్రైవర్‌తో కలిపి నలుగురు మాత్రమే ప్రయాణించాల్సి ఉంటుందని, ప్రయాణికులకు ఉపయోగించే వాహనాలలో మాత్రమే ప్రయాణం చేయాలని, మోటార్ సైకిల్ మీద ప్రయాణం చేసేవారు తప్పని సరిగా హెల్మెట్ ధరించాలని, వాహన చోదకులు మద్యం తాగి వాహనం నడిపి పట్టుబడితే 10,000 రూపాయల జరిమానా లేదా జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుందని అవగాహన కల్పించారు. 18 సం.లోపు వ్యక్తులు వాహనాలు నడిపితే ఆ వాహన యజమాని మీద క్రిమినల్ కేసులు నమోదు చేస్తారని చెప్పారు. బైక్ లకు పరిమితికి మించిన సౌండ్ సిస్టమ్, ఆటోలలో సౌండ్ సిస్టంలు పెట్టుకుని పట్టుబడితే వాహనాలు సీజ్ చేస్తారని తెలిపారు. అసాంఘిక కార్యకలాపాల గురించి ఏమన్నా సమాచారం ఉంటే స్థానిక పోలీసులకు లేదా డయల్ 112 కి సమాచారం ఇవ్వాలని కోరారు.

# గొర్రెపాటి శ్రీను పుట్టిన రోజు వేడుకలో ఆకుపాటి



(షణ్ముఖ వెలుగు, పామూరు, ఫిబ్రవరి 6)

ఉమ్మడి ప్రకాశం జిల్లా జనసేన పార్టీ నాయకులు గొర్రెపాటి శ్రీను పుట్టిన రోజు వేడుకలు ఒంగోలులోని వారి నివాసం నందు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎంపీటీసీల సంఘం అధ్యక్షుడు ఆకుపాటి వెంకటేష్ మాట్లాడుతూ గొర్రెపాటి శ్రీనుతో తనకి మంచి సోదర సన్నిహిత భావం ఉందన్నారు. మంచి వ్యక్తి అని కష్టం వస్తే నేనున్నాను అని భరోసా కల్పించే వ్యక్తి శ్రీనన్న అని ఆకుపాటి కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆకుపాటి మిత్రులు బోయిన రాయుడు, కుటాకుల్ల కళ్యాణ్, భాయ్ టీమ్ గాడి మహేంద్ర, శిగ తిరుపాలు, వంశీ, గుత్తి మహేష్, కంత కోటయ్య, గోసుల సురేంద్ర, టెంకం ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాసేవ కోసమే రాజకీయాల్లోకి వచ్చా

## టిడిపి ఇన్చార్జి గూడూరి ఎరిక్షన్ బాబు

(షణ్ముఖ వెలుగు, పెద్దారవీడు, ఫిబ్రవరి 6)

ప్రజాసేవ కోసమే రాజకీయాల్లోకి వచ్చానని యర్రగొండపాలెం టిడిపి ఇన్చార్జి రాష్ట్ర అధికార ప్రతినిధి గూడూరి ఎరిక్షన్ బాబు అన్నారు. శుక్రవారం మండలంలోని గోబ్బూరు గ్రామంలో రైతులకు నూతన పట్టాదారు పాస్ పుస్తకాలను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఇన్చార్జి ఎరిక్షన్‌బాబు మాట్లాడుతూ ఎన్ని ఇబ్బందులు ఎదురైనా ప్రజాసేవకు వెనుకడుగు వెయ్యబోను అన్నారు. డబ్బు సంపాదన కోసం కాకుండా ప్రజాసేవ కోసమే రాజకీయాల్లోకి వచ్చానన్నారు. రాష్ట్ర అభివృద్ధి సీఎం చంద్రబాబు ద్యేయమని అన్నారు. ఎర్రగొండపాలెం అభివృద్ధి తమ ప్రధాన లక్ష్యం అన్నారు. ఈ కార్యక్రమంలో మండల తహసిల్దార్ దిలీప్ కుమార్, మండల కన్వీనర్ మెట్టు శ్రీనివాస్‌రెడ్డి, మాజీ కన్వీనర్ గొట్టం శ్రీనివాసరెడ్డి, మాజీ ఎంపీపీ చంద్రగుంట్ల నాగేశ్వరరావు, మాజీ జెడ్పిటిసి జెడ్డా రవి, సర్పంచ్ ఆకుమల్ల శ్రీనివాసరెడ్డి, మాజీ సర్పంచ్ ఎల్లయ్య, నాయకులు ఈశ్వర్, వెంకట్‌రెడ్డి, సుబ్బారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# బూత్ స్థాయి వ్యవస్థతోనే శాశ్వత విజయం

## ఎన్నికల యుద్ధంలో బూత్‌లే కీలకం

## ఫోకస్ బూత్‌ల పై నంద్యాల పార్లమెంట్ శ్రేణులకు ఎమ్మెల్యే ఏలూరి దిశానిర్దేశం



(షణ్ముఖ వెలుగు, పర్చూరు ప్రతినిధి, ఫిబ్రవరి 6)

తెలుగుదేశం పార్టీ ఎన్నికల విజయానికి బూత్ స్థాయి వ్యవస్థే కీలకమని పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు స్పష్టం చేశారు. ప్రతి కార్యకర్త బూత్ స్థాయిలో చురుకుగా, నిబద్ధతతో పనిచేస్తే విజయం తథ్యమని ఆయన పేర్కొన్నారు. శుక్రవారం మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యాలయంలో నిర్వహించిన ఫోకస్ బూత్‌ల వర్క్‌షాప్లో నంద్యాల పార్లమెంట్ నియోజకవర్గ పార్టీ శ్రేణులను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు.తెలుగుదేశం పార్టీతోనే రాష్ట్ర సమగ్ర అభివృద్ధి, పునర్నిర్మాణం సాధ్యమవుతుందన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రం అన్ని రంగాలలో వేగంగా అభివృద్ధి పథంలో దూసుకుపోతోందని అన్నారు. అపార అనుభవం, మేధస్సు, అంకితభావం కలిగిన నేతగా చంద్రబాబు రాష్ట్రాన్ని ముందుకు నడిపిస్తున్నారని కొనియాడారు.రాష్ట్ర అభివృద్ధే ధ్యేయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు అహర్నిశలు శ్రమిస్తున్నారని, రానున్న ఐదేళ్లలో ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే అగ్రగామిగా నిలిపేందుకు ఒక యజ్ఞంలా పనిచేస్తున్నారని తెలిపారు. ఆయన వయస్సు, మేధస్సును దృష్టిలో ఉంచుకొని తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులుగా ప్రతి కార్యకర్త రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

బూత్ మేనేజ్‌మెంట్ అసలైన బలం...

ప్రతి బూత్‌లో ఓటర్ల పూర్తి వివరాలు, స్థానిక సమస్యలు, ప్రభుత్వ పథకాల లబ్ధిదారుల సమాచారం స్పష్టంగా ఉండాలని ఎమ్మెల్యే ఏలూరి సూచించారు.ఎన్నికల రోజే కాదు... ఎన్నికల ముందు రోజు, ఎన్నికల తరువాత కూడా బూత్ స్థాయి వ్యవస్థ బలంగా ఉండాలి. అదే పార్టీకి శాశ్వత బలం అని ఆయన స్పష్టం చేశారు.



ఎన్నికల వ్యూహాల పై స్పష్టత...

ఈ వర్క్‌షాప్‌లో బూత్ కమిటీ నిర్మాణం, బూత్ ఇన్‌చార్జ్‌ల బాధ్యతలు, ఓటర్లతో నిరంతర సంప్రదింపులు, సోషల్ మీడియా సమర్థ వినియోగం, ప్రతిపక్ష ప్రచారాన్ని ఎలా ఎదుర్కోవాలనే అంశాలపై ఎమ్మెల్యే ఏలూరి విపులంగా వివరించారు. ప్రజల నమ్మకం గెలవడమే అసలైన ఎన్నికల వ్యూహమని ఆయన పేర్కొన్నారు.

సంస్థాగత బలోపేతమే లక్ష్యం...

గ్రామస్థాయి నుంచి జాతీయ స్థాయి వరకు తెలుగుదేశం పార్టీని పటిష్టంగా నిలబెట్టాలంటే క్రమశిక్షణ, సమన్వయం తప్పనిసరిగా అవసరమని ఏలూరి తెలిపారు.పార్టీ కోసం పనిచేసే ప్రతి కార్యకర్తకు గౌరవం లభించేలా వ్యవస్థ ఉండాలి. కార్యకర్తే పార్టీకి ప్రాణం”అని ఆయన అన్నారు.

విజయానికి మార్గదర్శకంగా వర్క్‌షాప్...

ఈ వర్క్‌షాప్‌లో పాల్గొన్న నంద్యాల పార్లమెంట్ నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే ఏలూరి సూచనలను ఆసక్తిగా విన్నారు. ఈ సమావేశం తమకు స్పష్టమైన దిశానిర్దేశం చేసిందని పలువురు అభిప్రాయపడ్డారు.ఈ కార్యక్రమం ద్వారా రాబోయే ఎన్నికలకు తెలుగుదేశం పార్టీ బూత్ స్థాయి నుంచే సమగ్రంగా సిద్ధమవుతోందని, సంస్థాగతంగా మరింత బలపడే దిశగా అడుగులు వేస్తోందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# రూ.2.73 కోట్ల అభివృద్ధి పనులు ప్రారంభం, శంకుస్థాపనలు

## గిద్దలూరు నియోజకవర్గం అభివృద్ధికి పూర్తి సహకారం

## ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్

(షణ్ముఖ వెలుగు, గిద్దలూరు, ఫిబ్రవరి 6)

గిద్దలూరు నియోజకవర్గ అభివృద్ధికి పూర్తి స్థాయిలో సహకరిస్తానని ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ హామీ ఇచ్చారు. శుక్రవారం మంత్రి గొట్టిపాటి రవి కుమార్, స్థానిక ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి తో పాటు మార్కాపురం జిల్లా గిద్దలూరులో పర్యటించారు. ఇందులో భాగంగా గిద్దలూరు నియోజకవర్గంలో వివిధ ప్రారంభోత్సవాలు, శంకుస్థాపన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ముందుగా మార్కాపురం జిల్లాలో ఒంగోలు – నంద్యాల రోడ్డు నుంచి ఎల్‌కోట వరకు రూ.50 లక్షలతో



నిర్మించిన రహదారిని మంత్రి గొట్టిపాటి ప్రారంభించారు. అనంతరం తురిమెళ్ల పంచాయితీ పరిధిలోని తురిమెళ్ల గ్రామంలో రూ.50 లక్షలతో నిర్మించిన అంతర్గత సిమెంట్ రోడ్లను ప్రజలకు అంకితం చేశారు. అదే విధంగా కంభం – గిద్దలూరు ఆర్ అండ్ బీ రోడ్డు నుంచి నర్సిరెడ్డి పల్లె గ్రామం వరకు రూ. కోటితో నిర్మించే తారురోడ్డుకు శంకుస్థాపన చేశారు. దీనితో పాటు కంభం – గిద్దలూరు ఆర్ అండ్ బీ రోడ్డు నుంచి గౌతవరం గ్రామం వరకు రూ.73 లక్షలతో నిర్మాణం చేపట్టనున్న సిమెంట్ రోడ్డుకు కూడా మంత్రి గొట్టిపాటి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే అశోక్ రెడ్డితో పాటు అధికారులు, స్థానిక నేతలు పాల్గొన్నారు.





# గాంధీనగర్‌లో ఫ్రైడే డ్రైడే, కుష్టి వ్యాధిపై అవగాహన



(షణ్ముఖ వెలుగు, గోపవరం, ఫిబ్రవరి 6)

గాంధీనగర్ సచివాలయ పరిధిలోని మహమ్మద్ కాలనీలో ఈరోజు ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా లెప్రసీ (కుష్టి) అవేర్నెస్ క్యాంపును ఏర్పాటు చేసి ప్రజలకు కుష్టి వ్యాధి లక్షణాలు, నివారణపై అవగాహన కల్పించారు.ప్రతి ఒక్కరూ వారానికి ఒకసారి ఫ్రైడే డ్రైడే తప్పనిసరిగా పాటించాలని అధికారులు సూచించారు. ఇళ్లలోని పాత్రలు, పాత డ్రమ్ములు, ఫ్రిజ్ ట్రేలు, కూలర్లు, ఇంటి వెనుక భాగాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని తెలిపారు. వారానికి ఒకసారి నీటిని పూర్తిగా పారబోసి ఆరబెట్టి తిరిగి నీటిని నింపాలని సూచించారు. అలాగే కుష్టి వ్యాధి లక్షణాలుగా చర్మంపై స్పర్శ లేని మచ్చలు కనిపించడం, కనురెప్పలు పూర్తిగా మూతపడకపోవడం, అరిచేతులు--అరికాళ్లలో స్పర్శ కోల్పోవడం, కాళ్లకు చెప్పులు జారిపోవడం, చేతి వేళ్లు లేదా కాలి వేళ్లు వంకర తిరిగి అంగవైకల్యం రావడం వంటి లక్షణాలు ఉంటాయని వివరించారు. ఈ లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీప ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించాలని ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ వి. శివరామి రెడ్డి, మున్సిపల్ కమిషనర్ వి. వెంకట నరసింహారెడ్డి, హెల్త్ అసిస్టెంట్ కె. వెంకటసుబ్బయ్య, గాంధీనగర్ సచివాలయం అడ్మిన్, పోలీస్, శానిటరీ సెక్రటరీలు, ఆశా కార్యకర్తలు కే ఉమాదేవి, ఐ. రాములు పాల్గొన్నారు.

# శ్రీరంగనాయక స్వామి వారిని దర్శించుకున్న జిల్లా కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్

(షణ్ముఖ వెలుగు, బాపట్ల, ఫిబ్రవరి 6)

నగరం మండలం, పెద్దవరం గ్రామ లో వెలసి యున్న శ్రీరంగనాయక స్వామి వారిని శుక్రవారం ఉదయం జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ దర్శించుకున్నారు. రేపల్లె నియోజకవర్గం, నగరం మండలం, పెద్దవరం గ్రామం నందు భుహక్కు పత్రం, పట్టదారు పాస్ బుక్స్( మీ భూమి – మీ హక్కు) పాస్ బుక్స్ రైతులకు పంపిణీ చేసే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఉదయం పెద్దవరం గ్రామం చేరుకున్న జిల్లా కలెక్టర్‌కు ఆర్డీఓ, శ్రీరంగనాయక స్వామి వారి ఆలయ అధికారులు, అర్చకులు జిల్లా కలెక్టర్ కు స్వాగతం పలికి కలెక్టర్‌కు శ్రీరంగనాయక స్వామి వారిని ప్రత్యేక దర్శనం చేయించి అనంతరం అర్చకులు స్వామి వారి తీర్థ ప్రసాదాలు కలెక్టర్‌కి అందజేసి ఆశీర్వచనం చేశారు. ఈ







సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ శుక్రవారం శ్రీ రంగనాయక స్వామి వారిని దర్శించుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. జిల్లా ప్రజలు సుభిక్షంగా, సంతోషంగా ఉండాలని, జిల్లా అన్ని రంగాలలో అభివృద్ధి చెందాలని స్వామివారిని ప్రార్థించడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ హరే రామ్, రేపల్లె ఆర్డీఓ యన్ రామలక్ష్మి, తహశీల్దార్ నాచారయ్య, అనగాని శివప్రసాద్, ఆలయ అధికారులు, ఆలయ అర్చకులు, తదితరులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ విగ్రహ ఏర్పాటు సహించక దళిత యువకులకు అరికాళ్ళ కోటింగ్ ఇచ్చిన సీఐ శేషగిరిరావు

## కానుకగా ఎస్ఎన్ పాడు నియోజకవర్గంలో కీలకమైన రూరల్ సీఐ పోస్టింగ్? దళిత నేత నీలం నాగేంద్రరావు ధ్వజం

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఫిబ్రవరి 6)

మార్టూరు మండలం దేగరమూడి గ్రామంలో రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ విగ్రహ ఏర్పాటు విషయంలో కీలకంగా ఉన్నారని కక్షతో దళిత యువకుల్ని పోలీస్ స్టేషన్‌కి పిలిపించి అరికాళ్ళ కోటింగ్ ఇచ్చిన కమ్మ కులానికి చెందిన సీఐ శేషగిరిరావును ఒంగోలు రూరల్ సీఐ గా నియమించటం కూటమి ప్రభుత్వ కులతత్వ పాలనకు నిదర్శనం అని దళిత హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షులు నీలం నాగేంద్రరావు ఆరోపించారు. శుక్రవారం సమితి కార్యాలయంలో జరిగిన సమావేశంలో నీలం నాగేంద్ర మాట్లాడుతూ మార్టూరు మండలం దేగలమూడి గ్రామంలో రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ విగ్రహాన్ని పంచాయితీ తీర్మానంతో ఆ గ్రామా దళితులు ఏర్పాటు చేసుకున్నారు. ఆ గ్రామ తెలుగుదేశం పార్టీకి చెందిన జాగర్లమూడి శ్రీనివాసరావు, గోరంట్ల శేషగిరిరావు అను తెలుగుదేశం పార్టీకి చెందిన నాయకులు అగ్రకుల అహంభావంతో పంచాయితీ సెక్రటరీ కన్నెబోయిన శ్రీనివాసరావు అనే వేక్తి చేత అంబేద్కర్ విగ్రహాన్ని మాయం చేశారు. అగ్రకులాలు మాయం చేసిన అంబేద్కర్ విగ్రహ స్థానంలో అంబేద్కర్ చిత్రపటాన్ని తిరిగి పెట్టుకున్నారు . మరలా పంచాయితీ సెక్రటరీ అంబేద్కర్ చిత్రపటాన్ని కూడా త్వాలగించి తీసుకెళ్తు అడ్డుపడిన యస్‌సి మహిళని కూడా బెదిరించాడు. అంబేద్కర్ ఫ్లెక్సీ పెట్టినా ఒప్పుకోము అంటూ పంచాయితి సెక్రటరీ రెచ్చిపోయి అధికార తెలుగుదేశం నాయకుల కనుసన్నల్లో వీరంగం చేశాడు . ఈ అంబేద్కర్ విగ్రహ స్థాపనలో కీలకంగా ఉన్న అల్లాడి ప్రమోద్ కుమార్, జ్యోతి పోతులూరి అను యువకులను తెలుగుదేశం నాయుకులు మార్టూరు పోలీస్ స్టేషన్ కి పిలిపించారు. గత సంవత్సరం సెప్టెంబర్ 26వ తేదీ ఉదయం 10.30 గంటలకు మార్టూరు పోలీస్ స్టేషన్‌లో తెలుగుదేశం నాయుకులు సమక్షంలో అప్పటి సీఐ శేషగిరి రావు యస్ సి యువకులు అయినా అల్లాడి ప్రమోద్ కుమార్, జ్యోతి పోతులూరిని చిత్రహింసలు పెట్టారు. యస్‌సి యువకులు ఇద్దరి మోకాళ్లపై బూటు కళ్ళతో మార్టూరు సీఐ శేషగిరి రావు తొక్కుతూ కానిస్టేబుళ్లు చేత అరికాళ్ళ కొట్టింగ్ ఇప్పించాడు. మరసటి రోజు బాధిత యువకులు మార్టూరు గవర్నమెంట్ హాస్పటల్ లో చికిత్స పొందిన కేస్ నమోదు కాలేదు. దళిత యువకులపై కాకీ దాష్టికం ఘటన మీడియాలో వెలుగుచూసిన బాపట్ల కలెక్టర్, ఎస్పీలకు ఫిర్యాదు చేసిన కేస్ కట్టలేదు. అంతట దళిత హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షులు నీలం నాగేంద్రరావు బాపట్ల వెళ్లి మరల జిల్లా కలెక్టర్, ఎస్పీలకు ఫిర్యాదు చెయ్యగా బాపట్ల ఆర్‌డిఓ గ్లోరియా, రామాంజనేయులును విచారణకు పంపించారు. కానీ తెలుగుదేశం ప్రభావిత బాపట్ల ఆర్డీవో, డీస్పీలు దేగలమూడి రాకుండా మార్టూరు ఎంపీడీఓ కార్యాలయంలో మొక్కుబడి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో దళిత నాయకులు నీలం నాగేంద్ర, చార్వాక, దారా అంజయ్య, తదితరులు మార్టూరు సిఐ శేషగిరిరావు పై యస్‌సి, యస్‌టి కేస్ నమోదు చేసి అరెస్ట్ చెయ్యాలని డిమాండ్ చేశారు. ఈ లోపు మార్టూరు సీఐ శేషగిరిరావు తన అధికార ఖాకీ పవర్, కూటమి ప్రభుత్వ సహకారంతో బాధిత యస్‌సి యువకుల పైనే కౌంటర్ కేస్ నమోదు చేశాడు. బాపట్ల జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్ వెంటనే దేగలమూడి గ్రామంలో అంబేద్కర్ విగ్రహానికి అనుమతి ఇచ్చారు. అంబేద్కర్ విగ్రహ ఏర్పాటు విషయంలో కమ్మని ఖాకీ సీఐ శేషగిరిరావు పై యస్‌సి, యస్‌టి కేసు నమోదు చెయ్యాలని గత సంవత్సర అక్టోబర్ 11వ తేదీన మార్టూరు షూ కీ సీడ్ పోస్ట్ ద్వారా బాధితులు ఫిర్యాదు చేసారు. కేసు నమోదు కానందున మరల 17వ తేదీన బాపట్ల డిఎస్పీకి మరో ఫిర్యాదు పంపటం జరిగింది. డీఎస్పీ కూడా స్పందించక తన కులానికి చెందిన మార్టూరు సీఐకు గొడుగుపెట్టేరు. మరలా ఈ ఘటన పై బాపట్ల ఎస్పీ ఉమామహేశ్వర్‌కు కలిసి రాతపూర్వక ఫిర్యాదు ఇవ్వటం జరిగింది. తరువాత మార్టూరు సీఐ శేషగిరిరావు పై జాతీయ యస్‌సి కమిషన్‌కు ఫిర్యాదు చేస్తే అప్పుడు మార్టూరు సీఐ శేషగిరిరావును గుంటూరు రేంజ్ వీఆర్‌కు పిలిపించారు. సనాతన స్టార్ పవన్ కళ్యాణ్‌ను విమర్శించారని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ని బూతులు తిట్టారు అని ప్రతిపక్ష నాయకులని అరెస్ట్ చేసి జైలుకు పంపుతున్న కూటమి ప్రభుత్వం రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ విగ్రహాన్ని మాయం చేసిన తెలుగుదేశం నాయకులు యస్‌సి యువకులను బూటు కాలితో తొక్కి అరికాళ్ళ కోటింగ్ ఇచ్చిన శేషగిరిరావుకు కనీసం కేసు ఎందుకు నమోదు చేయలేదన్నారు. రఘు రామ కృష్ణరాజును గత ప్రభుత్వంలో అరికాళ్ళ కోటింగ్ ఇచ్చారనే అక్కసుతో డీజీపీ కావాల్సిన దళిత సీనియర్ ఐపిఎస్ అధికారి పివి సునీల్ కుమార్‌ను కూటమి ప్రభుత్వం వేధిస్తుందన్నారు. రఘురామకృష్ణ రాజు కాళ్ళు దేగలమూడి గ్రామ దళిత యువకులు కాళ్ళు ఒకటికాదా ? రఘురామా కృష్ణ రాజు కాళ్ళు ఎమన్నా వెంకటేశ్వర స్వామి పాదాల అని నీలం ప్రశ్నించారు ? కూటమి ప్రభుత్వంలో దళిత పోలీస్ అధికారులకు పోస్టింగ్ ఇవ్వకుండా లూప్ లైన్ లో పెడుతున్నారు. ఎస్‌సి రిసర్వ్ నియోజకవర్గం అయిన సంతనూతలపాడులో కీలకం అయిన ఒంగోలు రూరల్ సీఐ గా అంబేద్కర్ ద్వేషి, దళిత యువకుల పై దాష్టీకానికి పాల్పడిన కమ్మని శేషగిరిరావు నియామకాన్ని రద్దు చేసి దళిత సీఐ ని నియమించాలని నీలం డిమాండ్ చేశారు.



# ఆంధ్రప్రదేశ్‌లో నూతన రైల్వే లైన్ల ఏర్పాటు పై మాగుంట ప్రశ్న

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఫిబ్రవరి 6)

ఆంధ్రప్రదేశ్ గత 5 సంవత్సరాలలో మంజూరయిన, పూర్తయిన, నిర్మాణంలోని రైల్వే ప్రాజెక్టులు, నిధులు గురించి ప్రస్తుత పార్లమెంటు సమావేశాలలో ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి ప్రశ్నించారు. ఆయన అడిగిన ప్రశ్నకు కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైశ్నవ్ సమాధానమిస్తూ రైల్వే ప్రాజెక్టుల పరిధి పెచ్చు కనుక వాటి ఏర్పాటు రాష్ట్రాలను బట్టి కాక, రైల్వే జోన్లను బట్టి, ఆదాయం, రద్దీ, భూసేకరణ, అనుమతులు, రాష్ట్రాల యంపిల కోరికలు, రైల్వే అవసరాలు, కొనసాగుతున్న ప్రాజెక్టులు, నిధుల లభ్యత మొదలగు అంశాల పై ఆధారపడి మంజూరు చేయడం జరుగుతుందన్నారు. మౌలిక, భద్రతా పనులకు 2 తెలుగు రాష్ట్రాలలో 2009-14 సంవత్సరాలలో బడ్జెట్ కేటాయింపు రూ.886 కోట్లు చేయబడగా, 2014-25 ఆంధ్రప్రదేశ్ కు రూ.9,417 కోట్లు కేటాయింపి జరిగింది. 2009-14 లో 363 కి.మీ, 2014-25 లో 1,582 కి.మీ. కొత్త రైల్వే లైన్లు నిర్మించబడ్డాయని తెలిపారు. 01-04-2025 నాటికి ఆంధ్రప్రదేశ్‌లో రూ.6,413 కోట్లతో 12 నూతన లైన్లు, రూ.21,626 కోట్లతో 27 లైన్లు డబ్లింగ్ పనులు నిర్మాణంలో వున్నాయని తెలిపారు. విజయవాడ-మచిలీపట్నం, భీమవరం-నిడదవోలు, రాయచూర్-గుంతకల్, గుంతకల్-కల్లూరు, యెలహంక-పెనుగొండ, గుత్తి-ధర్మవరం, కొత్తవలస-కోరాపుట్, గుంతకల-గుంటూరు, పెనుగొండ-ధర్మవరం , గుత్తి-పెండేకల్లు, గుంటూరు-గుంతకల్ లైన్లు డబ్లింగ్ పనులు జరుగుతున్నాయని తెలిపారు. విజయవాడ-గూడూరు, విజయనగరం-నేర్గుండి కొత్తవలస, దువ్వాడ-సింహాచలం, గూడూరు-రేణిగుంట మధ్య 3-4వ లైన్లు నిర్మాణంలో వున్నాయని తెలిపారు. నంద్యాల-యర్రగుంట్ల, జగ్గయ్యపేట-జన్ పహాడ్, ఓబులవారిపల్లె-కృష్ణపట్నం, కోటిపల్లి-నర్సాపూర్, నడికుడి-శ్రీకాళహస్తి, రాయదుర్గ్-తుంకూర్, మరికుప్పం-కుప్పం, మలుగూరు-పాలసముద్రం, మల్కనగిరి-పాండురంగాపురం, ఎర్రుపాలెం--అమరావతి-నంబూరు నూతన లైన్లు నిర్మాణంలో వున్నాయని కేంద్రమంత్రి తెలిపారు.

# యూనిఫైడ్ సర్వేను నిర్దిష్ట గడువులోపు పూర్తి చేయాలి

### కలెక్టర్ వినోద్ కుమార్

### విద్యార్థుల హాజరు తగ్గితే హెచ్ఎం, ఎంఈఓలదే బాధ్యత



(షణ్ముఖ వెలుగు, బాపట్ల, ఫిబ్రవరి 6)

యూనిఫైడ్ సర్వేను నిర్దిష్ట గడువులోపు సచివాలయ సిబ్బంది తప్పనిసరిగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి. వినోద్ కుమార్ ఆదేశించారు. శుక్రవారం మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి అన్ని మండలాల ఎంపీడీవోలు, ఎంఈఓలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి యూనిఫైడ్ సర్వే, టీచర్స్ అటెండెన్స్, విద్యార్థుల హాజరు తదితర అంశాల పై సమీక్ష చేపట్టారు. యూనిఫైడ్ సర్వే పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. రైతులకు పాస్‌బుక్కులు పంపిణీ కార్యక్రమం ఉన్న నేపథ్యంలో వీఆర్వోలకు మినహాయింపు ఇచ్చినట్లు తెలిపారు. మిగతా అన్ని శాఖల సిబ్బంది ఈ సర్వేలో చురుకుగా పాల్గొనాలని ఆదేశించారు.పి4వెరిఫికేషన్ సర్వేను త్వరగా పూర్తి చేసి బంగారు కుటుంబాలను గుర్తించాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న సిటిజన్ ఈకేవైసీ నివేదికలను వెంటనే పూర్తి చేయాలని అన్నారు. వాట్సాప్ సేవలపై కూడా సర్వే నిర్వహించాలని తెలిపారు. మండల ఎంఈఓలతో విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరుపై ప్రత్యేకంగా సమీక్ష నిర్వహించారు. ప్రతి పాఠశాలలో విద్యార్థుల హాజరు శాతం తగ్గకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. హాజరు తక్కువగా నమోదు అయితే సంబంధిత పాఠశాల హెచ్ఎం, మండల ఎంఈఓలదే పూర్తి బాధ్యత అని స్పష్టం చేశారు. స్కూల్ డ్రాప్‌అవుట్స్ లేకుండా చూడాలని, డ్రాప్స్ శాతం తగ్గేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పనితీరు సరిగా లేని ఎంఈఓలపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేస్తూ నేరుగా వారితో మాట్లాడారు. విద్యార్థులకు ఐఎఫ్‌పి టాబ్లెట్ల పంపిణీలో సరైన ఫలితాలు చూపని బాపట్ల ఎంఈఓపై అసంతృప్తి వ్యక్తం చేసి, తదుపరి సమావేశానికి మెరుగైన ఫలితాలు చూపాలని ఆదేశించారు. ఈ సమవేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్ సింగ్, సచివాలయల కో ఆర్డినేటర్ యశ్వంత్ పాల్గొన్నారు.




# పేకాట ఆడుతున్న ముగ్గురు అరెస్టు

## రూ.9070 నగదు, మూడు మోటర్ బైకులు స్వాధీనం

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఫిబ్రవరి 6)

ఒంగోలు మున్సిపాలిటీ పరిధిలో కేశవరాజు కుంట శివారులో కోతముక్క, పేకాట ఆడుతున్న ముగ్గురిని టాస్క్ ఫోర్స్ పోలీసులు శుక్రవారం పట్టుకున్నారు. వారి వద్ద నుండి రూ.9070, మూడు మోటార్ సైకిల్లు స్వాధీన పరుచుకొని ఒంగోలు తాలూకా పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఈ దాడి టాస్క్ ఫోర్స్ ఇంచార్జ్ సిఐ యు సుధాకర్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ దాడిలో ఎస్ఐ సుదర్శన్, ఏఎస్ఐ మహబూబ్ భాషా, సిబ్బంది పాల్గొన్నారు.

# చీరాల సబ్ డివిజన్ శక్తి టీం అవగాహన కార్యక్రమం



(షణ్ముఖ వెలుగు, చీరాల, ఫిబ్రవరి 6)

బాపట్ల జిల్లా ఎస్పీ బి ఉమామహేశ్వర్ ఆదేశాల మేరకు డిఎస్పి ఎండి మోయిన్ సూచనలతో చీరాల సబ్ డివిజన్ శక్తి టీం ఆధ్వర్యంలో రామ్ నగర్ ఎస్సీ కాలనీ మొదటి వార్డు, 300 కాలనీలలో ప్రజలకు శక్తి టీం కానిస్టేబుల్ సుబ్బారావు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అయిన మాట్లా డుతూ సమాజంలో పెరుగుతున్న డ్రగ్స్ వినియోగం, బాల్య వివాహాల దుష్పరిణామాలు, సైబర్ నేరాలు, ట్రాఫిక్ నియమాలు, చిన్నపిల్లల పట్ల తల్లిదండ్రులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విస్తృతంగా అవగాహన కల్పించారు.ప్రత్యేకంగా తల్లిదండ్రులు తమ పిల్లలు ఏమి చేస్తున్నారు, ఎవరితో తిరుగుతున్నారు, చెడు వ్యసనాలకు అలవాటు పడుతున్నారా అనే విషయాలను నిరంతరం గమనించాలని సూచించారు. ప్రేమ పేరుతో పాఠశాల స్థాయిలోనే పిల్లలు తప్పుదారిలోకి వెళ్లే ప్రమాదం ఉందని, అందుకే వారి సెల్‌ఫోన్లు, పుస్తకాల సంచులు అప్పుడప్పుడు పరిశీలించాలని తల్లిదండ్రులకు తెలిపారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద లింకులు, కాల్స్, మెసేజ్‌లకు స్పందించవద్దని, ఏదైనా సమస్య ఎదురైతే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానికులు, మహిళలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్ళాలి


### మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి



(షణ్ముఖ వెలుగు, మార్కాపురం టౌన్, ఫిబ్రవరి 6)

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్ళాలని మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి తెలిపారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం మార్కాపురం మండల తెలుగు దేశంపార్టీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలుగుదేశం నాయకులు ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని అర్హత గల ప్రతి ఒక్కరికి సంక్షేమ ఫలాలు అందేలా చూడాల్సిన బాధ్యత తెలుగు దేశం నాయకులు పై ఉందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. తెలుగుదేశం నాయకులు గ్రామాల్లో క్రింది స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయాలని భవిష్యత్తులో ఏ ఎన్నికలు జరిగినా తెలుగు దేశం పార్టీ గెలవాలని నాయకులకు కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో పిఎస్ఎస్ చైర్మన్ గోలమారి నాసర్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు మస్తానయ్య, సర్పంచ్ మట్టం వెంకటేశ్వర్లు, గ్రామల తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సిగరెట్స్ హోల్సేల్ వ్యాపారస్తుల నిలువు దోపిడీ



(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, ఫిబ్రవరి 6)

సిగరెట్స్ హోల్సేల్ వ్యాపారస్తుల నిలువు దోపిడీ వలన సామాన్య ప్రజలు ఆర్థికంగా తీవ్రంగా నష్టపోతున్నారని వెంటనే అధికారులు హోల్సేల్ గోడౌన్లపై తనిఖీలు చేసి ధూమపాన ప్రియులకు న్యాయం చేయాలని 139 బీసీ కులాల జేఏసీ రాష్ట్ర చైర్మన్ మిరియం శ్రీనివాసులు ఒక ప్రకటనలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఎమ్మార్పీ రేటు కంటే అధికంగా డబ్బులు వసూలు చేస్తున్నారని, సిగరెట్స్ బ్లాక్ చేసి అధిక లాభాలు పొందుతున్నారని ఒక్క గోల్డ్ ఫిల్టర్ ప్యాకెట్ పై ఎంఆర్పి రేటు కంటే 30 రూపాయలు అధికంగా వసూలు చేస్తున్నారన్నారు. ఈ దోపిడిని అరికట్టవలసి అధికారులు నిమ్మకునీరెత్తినట్టుగా వ్యవహరించడం ఏమిటి అని ప్రశ్నించారు. అధికారులకు హోల్సేల్ వ్యాపారస్తుల దగ్గర భారీగా సిగరెట్లు నిల్వ ఉన్నా పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, ఇక నైనా అధికారులు కళ్ళు తెరిచి సిగరెట్స్ రేట్లు ఎమ్మార్పీ రేటుకు అమ్మే విధంగా చర్యలు తీసుకోవాలని శ్రీనివాసులు డిమాండ్ చేశారు.

# ఘనంగా ప్రారంభమైన క్విస్ ఫెస్ట్ 2026

## జాతీయస్థాయి వివిధ కాలేజి నుంచి విద్యార్థులు

**అలరిస్తున్న వివిధ రకాల స్టాల్స్**
**సందడి చేస్తున్న విద్యార్థులు**
**ఉత్సాహంగా సాగిన డీజే నైట్**

**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఫిబ్రవరి 6)**

ఒంగోలులోని క్విస్ ఇంజనీరింగ్ కళాశాలలో క్విస్ ఫెస్ట్ 2026 శుక్రవారం ఘనంగా ప్రారంభమైందని క్విస్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ నిడమానూరి సూర్య కల్యాణ్ చక్రవర్తి, ఎగ్జిక్యూటివ్ వైస్ ఛైర్మన్ డాక్టర్ నిడమానూరి శ్రీ గాయత్రి దేవి తెలియజేశారు. క్విస్ ఫెస్ట్ 2026 కి ఈ ఏడాది స్పందన అద్భుతంగా ఉందని ఈ సందర్భంగా వాళ్లు తెలియజేశారు. ఈ ఏడాది క్విస్ ఫెస్ట్ కి వివిధ రాష్ట్రాల నుంచి దాదాపు 1200 మంది విద్యార్థులు టెక్నికల్, స్పోర్ట్స్, పేపర్ ప్రజంటేషన్, పోస్టర్ ప్రజంటేషన్, సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వచ్చినట్లు వెల్లడించారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఇస్రో ఐపీఆర్ సీ యూనిట్ మాజీ డైరెక్టర్ బదరీ నారాయణ మూర్తి, స్పెషల్ గెస్ట్ గా బ్యాంక్ ఆఫ్ బరోడా రీజనల్ మేనేజర్ కృపా కిరణ్ రెడ్డి సారెళ్ల హాజరయ్యారు. ఈ సందర్భంగా బదరీ నారాయణమూర్తి మాట్లాడుతూ ప్రస్తుతం టెక్నాలజీ పరుగులు పెడుతోందని, దానికి తగ్గట్లుగా అందరూ అప్ డేట్ అవ్వాలని విద్యార్థులకు సూచించారు. తాము చదువుకునే రోజుల్లో ఇన్ని ఫెసిలిటీస్ లేవని, ఇప్పుడు సరికొత్త టెక్నాలజీలు అందుబాటులోకి వచ్చాయని ప్రతి ఒక్కరు దాన్ని అందిపుచ్చుకోవాలని అన్నారు. క్విస్ విద్యాసంస్థల్లో టెక్నికల్ ఎక్స్ పోని సందర్శించిన ఆయన విద్యార్థుల ప్రాజెక్ట్ లు అద్భుతంగా ఉన్నాయని కొనియాడారు. అనంతరం మాట్లాడిన బ్యాంక్ ఆఫ్ బరోడా రీజనల్ మేనేజర్ కృపా కిరణ్ రెడ్డి సారెళ్ల ప్రకాశం జిల్లా నుంచి ఎంతోమంది అద్భుతమైన విద్యావంతులు వచ్చారని క్విస్ విద్యాసంస్థల నుంచి అద్భుతమైన ఇంజనీర్లు తయారవుతారని ఆశాభావం వ్యక్తం చేశారు. కళాశాల మొత్తం తిరిగి చూశానని, అద్భుతమైన ల్యాబ్ లు, సౌకర్యాలు ఉన్నాయని చెప్పుకొచ్చారు. ప్రస్తుతం ఉన్న టెక్నాలజీ, ఇంటర్నెట్ని సరైన పద్ధతిలో వాడితే కచ్చితంగా జీవితంలో సక్సెస్ అవుతారని ఆయన అన్నారు. అనంతరం మాట్లాడిన నిడమానూరి శ్రీ గాయత్రి దేవి క్విస్ వరుసగా మూడో ఏడాది క్విస్ ఫెస్ట్ ని నిర్వహిస్తోందని అన్నారు. ఈసారి టెక్నికల్ కి, ప్రాజెక్ట్స్ ఎక్స్ పోకి ప్రాధాన్యతను ఇస్తూ నాలుగు రోజులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వికసిత భారత్ 2047 లక్ష్యాలతో ముందుకు వెళున్నామని దాని ఆధారంగానే థీమ్ ఎంచుకుంటున్నట్లు వెల్లడించారు. విద్యార్థులు అద్భుతమైన ప్రాజెక్ట్ లు చేస్తున్నారని, సాంస్కృతిక కార్యక్రమాలు సైతం అలరిస్తాయని అన్నారు. వెనుకబడిన ప్రకాశం జిల్లాలో ఇంజనీరింగ్ కళాశాలను స్థాపించిన నిడమానూరి సూర్య కల్యాణ్ చక్రవర్తి అద్భుతమైన విద్యావిధానంతో, ప్రాజెక్ట్ లపై శ్రద్ధచూపి విద్యార్థులను తీర్చిదిద్దుతున్నారని గాయత్రి దేవి అన్నారు. ఈ కార్యక్రమం అనంతరం సాయంత్రం జరిగిన డీజే నైట్ లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆడిపాడి చిందులేశారు. ఈ కార్యక్రమంలో క్విస్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వై.వి. హనుమంతరావు, ఫార్మసీ ప్రిన్సిపల్ డాక్టర్ కిశోర్ బాబు, డీపీఎస్ ఆర్ డైరెక్టర్ డాక్టర్ బి వి సుబ్బారావు పాల్గొన్నారు. కార్యక్రమానికి డాక్టర్ సమీర్ కుమార్ కన్వీనర్ గా, డాక్టర్ లక్ష్మీ వర ప్రసాద్, డాక్టర్ అరుణ్ నంబి కో కన్వీనర్లుగా వ్యవహరించారు.










# సాయిబాబా మందిరం 24వ వార్షికోత్సవం




**(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, ఫిబ్రవరి 6)**

ఉలవపాడు మండలం రాజుపాలెం గ్రామం నేషనల్ హైవే పైన ఉన్న సాయిబాబా మందిరం 24వ వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం వందల సంఖ్యలో భక్తుల మధ్య ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన మాజీ మంత్రి మానుగుంట మహీదర్ రెడ్డి పూజా కార్యక్రమంలో పాల్గొని భగవంతుని ఆశీర్వాదాలు తీసుకున్నారు. ఆ తర్వాత వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్నప్రసాదాలు అందించడంలో ప్రతి ఒక్కరూ సహకరించాలని భక్తులను కోరారు... ఈ ఈ వార్షికోత్సవ కార్యక్రమంలో చుట్టూ పక్కల గ్రామాల భక్తులు, రహదారిలో ప్రయాణిస్తున్న భక్తులు, కందుకూరు నియోజకవర్గం లో పెద్దాయన సన్నిహితులు పాల్గొన్నారు.









## 8న మీర్జాపేటలో మెడికల్ క్యాంపు

**(షణ్ముఖ వెలుగు, తర్లుపాడు, ఫిబ్రవరి 6)**

మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ తరపున ఈ నెల 8వ తేదీ ఆదివారం ఉదయం 9 గంటలకి మండలంలోని మీర్జాపేట గ్రామంలో మెడికల్ క్యాంపు నిర్వహించనున్నట్లు సంస్థ అధ్యక్షులు గుంటక సుబ్బారెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మెడికల్ క్యాంపులో డాక్టర్ బి గోపాల్‌రెడ్డి , జనరల్ సర్జన్ ఆపరేషన్ స్పెషలిస్ట్, డాక్టర్ సి సాయి కిరణ్‌రెడ్డి, డాక్టర్ సి వసంత కుమారి, గర్భకోశ వైద్యనిపుణురాలు ఇన్ ఫెర్టిలిటీ స్పెషలిస్ట్, సోనాలజిస్ట్, డాక్టర్ గుంటక నాగ సౌమ్యరెడ్డి, డెంటల్ స్పెషలిస్ట్, కంటికి సంబంధించి, రామాంజనేయరెడ్డి, శ్రీరామ్ నాయక్ లు వస్తారన్నారు. కావున గ్రామ ప్రజలు అందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు గుంటక సుబ్బారెడ్డి, కార్యదర్శి అన్నా రాము , కోశాధికారి తడికమల్ల శ్రీనివాసులు సంయుక్త ప్రకటనలో కోరారు.

## షార్ట్ సర్క్యూట్‌తో నివాస గృహం దగ్ధం

**రూ.2 లక్షల మేర ఆస్తి నష్టం**





**(షణ్ముఖ వెలుగు, తర్లుపాడు, ఫిబ్రవరి 6)**

మండలంలోని కేతగుడిపి గ్రామంలో శుక్రవారం మధ్యాహ్నం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో వెలుగు రమణ నివాస గృహం పూర్తిగా దగ్ధమైంది. సుమారు రూ.2 లక్షల మేర ఆస్తి నష్టం వాటిల్లింది. ఇంట్లోని గృహోపకరణాలు, దుస్తులు, నిత్యావసర సరుకులు మంటల్లో కాలిపోయాయి. సమాచారం అందుకున్న వెంటనే ఫైర్ ఇంజన్ సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకువచ్చింది. ఈ ఘటన పై సమాచారం అందుకున్న వెంటనే సచివాలయం సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. బాధిత కుటుంబానికి తక్షణ సహాయం అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని వారు తెలిపారు.

## గ్యారెంటెడ్ అభ్యసన సామర్థ్యాలు సాధించాలి




**(షణ్ముఖ వెలుగు, తర్లుపాడు, ఫిబ్రవరి 6)**

మండలంలోని ప్రతి పాఠశాలలో మార్చి నాటికి గ్యారెంటెడ్ అభ్యసన సామర్థ్యాలు, చతుర్విధ ప్రక్రియలు ప్రాథమిక స్థాయి తరగతులలో సాధించాలని తెలిపారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మీర్జా పేట నందు "పరీక్షాపే చర్చ" కార్యక్రమంలో పాల్గొని ఒత్తిడికి గురి కాకుండా విద్యార్థులు పరీక్షలు రాసి ఉన్నత ఫలితాలు సాధించాలని మండల విద్యాశాఖ అధికారి డి సుజాత పేర్కొన్నారు. జిల్లా విద్యా శిక్షణ సంస్థ పరిశీలకులు ఎస్ మహేంద్ర గొల్లపల్లి ప్రాథమిక పాఠశాలను, మీర్జాపేట ప్రాథమిక పాఠశాలను సందర్శించి ప్రాథమిక సామర్థ్యాల పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన విధంగా ప్రతి పాఠశాలలో "ముస్తాబు కార్నర్" ఏర్పాటు చేయాలని దీనివలన పిల్లలలో పరిశుభ్రత పెరిగి, డ్రాప్ అవుట్ కాకుండా ప్రతిరోజు ఉత్సాహంగా పాఠశాలకు హాజరవుతారని తెలిపారు, అలాగే త్వరలో జరగబోయే ఫార్మేటివ్ పరీక్షల లో గుణాత్మక విద్యాభివృద్ధి సాధించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రవీణ్ కుమార్, శ్రీహరి చక్రవర్తి, వెంకటరమణ ఉపాధ్యాయులు బి శ్రీనివాసరావు, సిఆర్పి అచ్యుతరావు, తదితరులు పాల్గొన్నారు.


On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL/2023/89152, e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com